సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 27.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 127
పేజీలు: 12 వెల: రూ. 5

## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు
### 45 మందికి స్థాన చలనం
మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లు


- జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా
- పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్
- జితేశ్ వీ పాటిల్ కు ఎస్పీడీసీఎల్ సీఎండీ బాధ్యతలు
- విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌కు అవకాశం

03




# తెలంగాణకు కొత్త విద్యాపాలసీ
## జాతీయ విద్యా విధానం తరహాలోనే బోధన

- విద్యా రంగంలో భారీ సంస్కరణలకు శ్రీకారం
- తెలంగాణకు ప్రత్యేక విద్యా విధానం సిద్ధం
- పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర మార్పులు
- 2026-27 నుంచే కొత్త పాలసీ అమలు లక్ష్యం
- జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణ అడుగులు
- యంగ్ ఇండియా మోడల్ స్కూళ్లకు ప్రాధాన్యం
- డిజిటల్ లెర్నింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం
- విద్యా కమిషన్ నివేదిక సీఎం రేవంత్ రెడ్డికి సమర్పణ
- గ్రామీణ విద్యార్థులకు ఉచిత రవాణా అవకాశాలు
- విద్య-పరిశ్రమల అనుసంధానానికి కొత్త దిశ




**ముద్ర, తెలంగాణ బ్యూరో**

వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి రాష్ట్రంలో నూతన విద్యాపాలసీ అమలులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తున్నది. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యత మెరుగుదల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల అభివృద్ధి వంటి అంశాల్లో విద్యా సంస్కరణలకు కృషి చేస్తోంది. ఈ మేరకు ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్యా పాలసీ తయారీ కోసం ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్ గురువారం తన నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసింది. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి , కమిషన్ సభ్యులు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావిధానంపైన 'ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ' పేరుతో ఉన్న నివేదికను సీఎంకు అందజేశారు.

కమిషన్ నివేదిక అందిన నేపథ్యంలో త్వరలోనే తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే అవ కాశం ఉంది. ఇది ఇలా ఉంటే జాతీయ విద్యా విధానం తరహాలోనే తెలంగాణలోనూ త్వరలోనే ప్రత్యేక విద్యా విధానం తీసుకురాబోతున్నామని గతంలోనే ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి... అదే సమయంలో విద్యా విధా నం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. దీంతో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, చైర్మన్ గా మరో ఐదుగురు సభ్యులు గా కమిటీ ఏర్పాటు చేస్తూ గతే డాది సెప్టెంబర్ లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సభ్యులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తెలం గాణ ఎడ్యుకేషన్ కమిషన్ అధ్యక్షుడు ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత వి ద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి ఉన్నారు. కమిటీ నియామకం సమయంలో విద్యాపాలసీపై సీఎం, ప్రభుత్వం ఆయా సభ్యులకు కీలక మిగతా 02లో






# పాలమూరులో.. ముక్కలైన కాంగ్రెస్
## మేయర్ పోరు కాంగ్రెస్‌లో మంటలు రేపింది!

- పాలమూరులో గ్రూప్ రాజకీయాలకు తెరతీసిన కార్పొరేషన్ ఎన్నికలు
- అధిష్టానం vs ఎమ్మెల్యే...మేయర్ ఎంపికలో హైటెన్షన్ డ్రామా
- ఆనంద్ గౌడ్ పై ఆరోపణలతో వేడెక్కిన కాంగ్రెస్ వర్గాలు
- మేయర్ కుర్చీ కోసం డబ్బుల రాజకీయాలు? పాలమూరులో సంచలనం
- ఎమ్మెల్యే యెన్నం పంతం.. అధిష్టానం వెనక్కి తగ్గిన సందర్భం
- ముదిరాజ్ కార్డుతో గెలిచిన ఎమ్మెల్యే రాజకీయ గేమ్
- కాంగ్రెస్‌లో రెండు వర్గాలు.. బహిరంగమైన అంతర్గత విభేదాలు
- ఒక్క మేయర్ పదవి.. పార్టీని రెండు ముక్కలు చేసిన రాజకీయాలు
- పాలమూరులో కాంగ్రెస్ భవిష్యత్తుపై ప్రశ్నలు రేపుతున్న అంతర్గత కలహాలు

10

*పాలమూరు కాంగ్రెస్‌లో కార్పొరేషన్ ఎన్నికల తర్వాత అంతర్గత విభేదాలు బహిర్గతమై రాజకీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి. మేయర్ పదవి ఎంపిక చుట్టూ తిరిగిన ఈ రాజకీయ డ్రామా, పార్టీని రెండు వర్గాలుగా విడగొట్టింది. ఒకవైపు అధిష్టానం, డీసీసీ నేతలు ఆనంద్ గౌడ్ వర్గాన్ని మద్దతు ఇవ్వగా.. మరోవైపు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తనదైన వ్యూహాలతో ప్రతిఘటించి పరిసితిని తనకు అనుకూలంగా మార్చుకున్నారు. చివరకు మేయర్ ఎంపికలో జరిగిన పరిణామాలు పాలమూరు కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత గుంపు రాజకీయాలను బహిర్గతం చేసి పార్టీ భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.*

**-ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



## ఒక్కటైన విజయ్ –రష్మిక
11





### ప్రభుత్వ ప్రగతిపై
## కేసీఆర్ & కో విష ప్రచారం
09
### మంత్రులు పొంగులేటి, పొన్నం, వివేక్

- పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్
- వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది
- వరుస ఎన్నికల్లో ప్రజల బుద్ధి చెబుతున్నా మారని బీఆర్ఎస్ వైఖరి
- కాళేశ్వరం ప్రాజెక్ట్ లో బీఆర్ఎస్ అవినీతికి బిజేపీ సహకారం




# రూట్ ఛేంజ్
## గులాబీ బాస్ బిగ్ ప్లాన్

- పట్టు కోసం రీలోడెడ్
- కేసీఆర్ నిశ్శబ్ద ఆపరేషన్
- బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా వ్యూహం
- బాధితుల దగ్గరకు కేటీఆర్
- ఇక నుంచి జిల్లాలకే ప్రయార్టీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి బలం కోల్పోతున్న బీఆర్ఎస్.. ఇప్పు డు స్థానిక నాయకత్వంపై ఫోకస్ మొదలుపెట్టేందుకు రెడీ అవుతోం ది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కేటీఆర్ విఫల ప్రయోగం మూటగట్టుకున్నారు. స్థానిక నేతలకు బాధ్యతలిస్తున్నామని చెప్పి పార్టీని మరింత కిందకు తీసుకువచ్చారు. మిగతా 02లో

BUILDERS ASSOCIATION OF INDIA
BAI
ESTD. 1941
వికసిత భారత అభియాన్
TELANGANA RISING 2047

బిల్డర్స్ డే సెలబ్రేషన్స్ & ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం

తేదీలు 27 & 28 ఫిబ్రవరి 2026
వేదిక: పద్మజా పామ్ గ్రోవ్స్ రిసార్ట్, హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో
ఆహ్వానం
బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ MC/GC సమావేశం మరియు బిల్డర్స్ డే వేడుకలకు మీరందరూ ఆహ్వానితులు.

ప్రధాన కార్యక్రమం
27 ఫిబ్రవరి 2026
సాయంత్రం 6:00 గంటలకు

ముఖ్య అతిథులు : శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు
గౌరవ మంత్రి, నీటిపారుదల, ఆహార & పౌర సరఫరాలు శాఖ, తెలంగాణ ప్రభుత్వం
శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు
గౌరవ మంత్రి, రోడ్లు, భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ, తెలంగాణ ప్రభుత్వం

గౌరవ అతిథులు
శ్రీ రాజేంద్ర సింగ్ కంబో గారు
నేషనల్ ప్రెసిడెంట్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా
శ్రీ ఎస్.ఎన్. రెడ్డి గారు
పాస్ట్ ప్రెసిడెంట్, IFAWPCA & బోర్డ్ మెంబర్, BAI
శ్రీ డి.వి.ఎన్. రెడ్డి గారు
నేషనల్ వైస్ ప్రెసిడెంట్, BAI

ఆర్గనైజింగ్ కమిటీ
శ్రీ ఎస్. కృష్ణారావు గారు – ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్
శ్రీ యు. సురేందర్ గారు – స్టేట్ చైర్మన్, తెలంగాణ
శ్రీ జి. సంతోష్ రెడ్డి గారు – ఆర్గనైజింగ్ సెక్రటరీ
శ్రీ వి. సత్యనారాయణ రావు గారు – ఆర్గనైజింగ్ వైస్ చైర్మన్
శ్రీ చందా రవీందర్ గారు – ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ
శ్రీ ఎస్. సత్యనారాయణ గారు – ఆర్గనైజింగ్ ట్రెజరర్
శ్రీ టి. భాస్కర్ రెడ్డి గారు – చైర్మన్, నల్గొండ సెంటర్

కమిటీ సలహాదారులు
శ్రీ బి. సీనయ్య గారు – పాస్ట్ ప్రెసిడెంట్, BAI
శ్రీ ఎన్. సచితానంద రెడ్డి గారు – పాస్ట్ వైస్ ప్రెసిడెంట్, BAI
శ్రీ వి. సత్యమూర్తి గారు – పాస్ట్ స్టేట్ చైర్మన్, BAI
శ్రీ బి. సుగుణాకర్ రావు గారు – పాస్ట్ ట్రస్టీ, BAI
శ్రీ వి. భాస్కర్ రెడ్డి గారు – పాస్ట్ స్టేట్ చైర్మన్, BAI
శ్రీ కె. దేవేందర్ రెడ్డి గారు – పాస్ట్ స్టేట్ చైర్మన్, BAI

## గ్రాస్‌బర్గ్ గని (ఇండోనేషియా)



000

ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం, కాపర్ గనుల్లో ఒకటి. పాపువా ప్రావిన్స్‌లో ఉంది, Freeport-McMoRan కంపెనీ నిర్వహిస్తుంది.



# రాష్ట్రంలో నూతన విద్యాపాలసీ

(మొదటి పేజీ తరువాయి)

సూచనలు చేసింది. తెలంగాణ రైజింగ్–2027' లక్ష్యానికి అనుగుణంగా కొత్త విద్యా విధానం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. డిజిటల్ బోధన, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్క రణలు, పరిశోధనలు, అంతర్జాతీయ అవకాశా లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పారిశ్రామిక రంగానికి, విద్యాసంస్థలకు మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు తగిన సూచనలు చేయాలని కోరింది. పాఠశాల విద్య నుంచి ఉన్నత, సాంకేతిక విద్య వరకు అన్ని స్థాయిల్లో అవసరమైన సంస్కరణ లతో నివేదిన ఇవ్వాలని సూచించింది. కాగా ఇందులో గ్రామాల్లోని ప్రీ–ప్రైమరీ పాఠశాల పిల్లలకు కూడా ఉచిత రవాణాను విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నూతన విద్యా విధా నాన్ని 2026–27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

## ఎన్సీఈఆర్టీపాఠ్యాంశం వివాదం

**ముద్ర, డెస్క్ :**
జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్య పుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అంటూ ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే . దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఆ పుస్తకాన్ని నిషేధించింది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు.

'ఈ విషయం నా దృష్టికి రాగానే ఆ పుస్తకాలు సర్క్యులేషన్‌లో లేకుండా వెనక్కి తీసుకోవాలని NCERTని ఆదేశించాను. న్యాయ వ్యవస్థను అగౌరవపర్చాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. మేం న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం ఇస్తాం. కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. జరిగిన దాని పట్ల చింతిస్తున్నాను. NCERTపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటాం'' అని మంత్రి వెల్లడించారు. ఈ పుస్తకంలోని అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు .. ఇప్పటికే సుమోటోగా విచారణకు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదంతా న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రే నంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇక ఇప్పటికే ఎన్‌సీఈఆర్‌టీ ఆ పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.



# రూట్ ఛేంజ్..

(మొదటి పేజీ తరువాయి)

దీంతో పార్టీ శ్రేణుల్లో నిస్తేజం బయట పడుతోంది. కేటీఆర్ నాయకత్వంపై కొంత అసంతృప్తి సైతం వెళ్లగక్కుతున్నారు. ఈ నేపథ్యంలోనే గులాబీ బాస్ కేసీఆర్ కూడా పార్టీ పట్టు కోసం నిశబ్ద ఆపరేషన్ కు శ్రీకారం చుట్టుతున్నారు. గులాబీ దళాన్ని రీలోడ్ చేసేందుకు ఫాంహౌస్ వేదికగా ప్రయోగాలు మొదలుపెట్టుతున్నారు. మరోవైపు భూముల వివాదాలు, పార్టీపరమైన గొడవలు వంటి పాటు ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతుందని భావించే అంశాలపై బీఆర్ఎస్ కొత్త పంథా మొదలుపెట్టింది. నేరుగా బాధితుల వద్దకు వెళ్లి.. అక్కడ ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత పెంచేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. తాజాగా గాంధీ సరోవర్ శివారులో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన భారీ గాంధీ విగ్రహం కోసం భూ సేకరణ ప్రక్రియలో భూములు కోల్పోతున్న బాధితుల దగ్గరకు వెళ్లిన బీఆర్ఎస్.. ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో బాధితుల ఆందోళన దగ్గరకు వెళ్లారు. గురువారం ఖమ్మం జిల్లాకు కేటీఆర్ వెళ్లారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో గుడిసెలు కోల్పోయిన బాధితులను కేటీఆర్ పరామర్శించారు. ఆయా జిల్లాల్లో పర్యటించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను కూడా త్వరలో కేటీఆర్ పరామర్శించనున్నారు.

**కేసీఆర్ పావులు**
తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజక వర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.

**ఫిరాయింపుల మధ్యే బృందం**
రాజకీయాలు వేగంగా మారుతున్నా కేసీఆర్ ఏమాత్రం తొందరపడకుండా వ్యవహరిస్తున్నారు. వెళ్లే వారిని అడ్డుకోకుండా, మిగిలి ఉన్న నిబద్ధత గల నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పదవుల కోసం పార్టీ మారే వారితో పోలిస్తే, సిద్ధాంతం కోసం నిలబడే వారే పార్టీకి అసలైన బలమని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తున్నారు. దీనికోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు.

**సెంటిమెంట్ కాదు.. సమస్యలేంటి..?**
గతంలో తెలంగాణ సెంటిమెంట్ మీద ఎక్కువగా ఆధారపడిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల మీద గొంతు ఎత్తుతోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడటం ద్వారా కోల్పోయిన ప్రజాధారణను మళ్ళీ పొందవచ్చని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. శాసనసభలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వ్యూహకర్తలతో కలిసి నిరంతర చర్చలు జరుపుతున్నారు. ఓ వైపు తెలంగాణ సెంటిమెంట్ తో పాటు ప్రజా సమస్యలను కూడా ఎక్కువగా తెరపైకి తెచ్చి పోరాడాలని భావిస్తున్నారు.

**కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్**
బయటకు పెద్దగా కనిపించకపోయినా, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ చదరంగం నడుపుతున్నారు. ఎప్పుడు ఏ అడుగు వేయాలో తెలిసిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైనపుడు దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకప్పుడు ఉద్యమ నేతగా పార్టీని ఎలా నిర్మించారో, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. సరైన సమయం చూసి బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్ని ఒక్క సారి రీయాక్టివేట్ చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో హైటెక్ రవాణా

### హైదరాబాద్‌కు కొత్త ట్రాన్స్‌పోర్ట్ విప్లవం



పాడ్ ట్యాక్సీలకు గ్రీన్ సిగ్నల్
మెట్రో నుంచి డైరెక్ట్ గమ్యం – పీఆర్‌టీతో ప్రయాణం సులువు
ట్రాఫిక్‌కు చెక్ పెట్టే పాడ్ ట్యాక్సీలు – స్మార్ట్ సిటీకి మరో అడుగు
డ్రైవర్ లేకుండా నడిచే హైటెక్ ట్యాక్సీలు త్వరలో
హైటెక్ సిటీ నుంచి పాడ్ ట్యాక్సీ సేవలు ప్రారంభం
మెట్రో స్టేషన్ నుంచే మీ గమ్యం – కొత్త రవాణా ప్లాన్ రెడీ
పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో పీఆర్‌టీ ప్రాజెక్ట్ ప్రారంభం
కాలుష్యం లేకుండా వేగవంతమైన ప్రయాణం – పాడ్ ట్యాక్సీల ప్రత్యేకత
రోజుకు లక్షల ప్రయాణికులకు ఉపశమనం – పాడ్ ట్యాక్సీ ప్రాజెక్ట్
హైదరాబాద్ ట్రాఫిక్‌కు స్మార్ట్ సొల్యూషన్ – పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
అభివృద్ధిలో దూసుకువెళ్తున్న హైదరాబాద్ లో హై టెక్ రవాణా అందుబాటులోకి రానున్నది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, ఆటోలు, ర్యాపిడో వంటి బైక్‌ల ద్వారా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్న నేపథ్యంలో... రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త తరహా ప్రయాణాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా విదేశాల్లో మాదిరిగా త్వరలోనే పాడ్ ట్యాక్సీలు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ పాడ్ ట్యాక్సీలను నగరంలోని మెట్రో స్టేషన్లను కనెక్ట్ చేయాలని నిర్ణయానికి వచ్చింది. ఈ తరహా రవాణాకు ప్రభుత్వం.. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ)గా నామకరణం చేసింది. మెట్రోరైలు స్టేషన్ల నుంచి ప్రయాణికులు తొందరగా తమ గమ్యస్థానం చేరేందుకు ఈ పాడ్ ట్యాక్సీలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనే చేపట్టాలనేది ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక చేయనున్నారు. అందుకు హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం నగరంలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు త్వరగా చేరుకునేందుకు మెట్రో బెస్ట్ ఆప్షన్ అయింది. అయితే మెట్రో దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఇవి అన్ని చోట్ల అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. దానికి తోడు ట్రాఫిక్‌లో నరకం. ఈ ఇబ్బందులను తొలగించేందుకు.. మెట్రో స్టేషన్ల నుంచి రోడ్ల మీదకు రావాల్సిన అవసరం లేకుండా నేరుగా పాడ్‌ట్యాక్సీల ద్వారా గమ్యస్థానాలను చేరుకునేలా వినూత్న రవాణా వ్యవస్థ ప్రవేశపెట్టేందుకు సర్కార్ రెడీ అయింది.

**ముందుగా ఐదు మార్గాల్లో**
ముందుగా.. రాయదుర్గం–కూకట్‌పల్లి, రాయదుర్గం–హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెట్రో స్టేషన్లు, నాలెడ్జి సిటీ, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాడ్ ట్యాక్సీలు పూర్తిగా ఆటోమేటెడ్, డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఈ ట్యాక్సీలు..గంటకు గరిష్ఠంగా 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రతి పాడ్ ట్యాక్సీలో 6 నుంచి 8 మంది ప్రయాణించవచ్చు. గంటకు 10వేల మందిని చేరవేసే సామర్థ్యం ఉంటుంది. బ్యాటరీ లేదా విద్యుత్తు వినియోగంతో ఎలాంటి కాలుష్యం సమస్య తలెత్తదు. మెట్రో స్టేషన్‌లో దిగడానికి కంటే ముందు పాడ్‌ట్యాక్సీని బుక్ చేసుకోవడం ద్వారా సమయా ఆదా అవుతుంది. ఇలాంటి రవాణా వ్యవస్థ ప్రస్తుతం ముంబైలో పట్టాలెక్కుతుండగా.. హైదరాబాద్ నగరంలోనూ అందుబాటులోకి రానుంది.

# ఉద్యమకారుల హామీల అమలుకు కమిటీ

### రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రొఫెసర్ కోదండరాం, ఉద్యమకారులతో భేటీ
కమిటీ విధి విధానాలు, ఉద్యమకారుల హామీలపై చర్చ
త్వరలోనే సీఎం రేవంత్ తో భేటీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం త్వరలో కమిటీ ఏర్పాటు చేయనుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పునరుద్ఘాటించారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమకారులు మంత్రి పొన్నం ను గురువారం హైదరాబాద్ లోని మంత్రుల భవనాల సముదాయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారుల హామీల అమలుకు ఏర్పాటు చేయతలపెట్టిన కమిటీకి సంబంధించిన విధి విధానాలు, ఉద్యమకారుల హామీలపై చర్చించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కావాలని ఈ సందర్భంగా నిర్ణయానికి వచ్చారు. ఇదిలావుంటే.. ఎన్నికల హామీల జాప్యంపై ఇటీవల స్పందించిన రాష్ట్ర హైకోర్టు.. వాటి అమలులో ఉన్న ఇబ్బందులతో పాటు ఎప్పటిలోగా మెనిఫెస్టో హామీలు అమలు చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై దృష్టిసారించినట్లు తెలుస్తున్నది. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభయహస్తం పథకం కింద ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, నెలకు సుమారు రూ.25వేల పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్ల స్థలాలు కల్పించాలన్న హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ ఉద్యమ జేఏసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యమకారులు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు నాలుగు రోజుల క్రితం విచారణ జరిపింది. అభయహస్తం పథకంకింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన తెలంగాణ ఉద్యమకారులకు ఎనిమిది వారాల్లోపు ఇండ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఫ్రీడమ్ ఫైటర్ శాఖ అధికారులకు జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. అర్హతల పరిశీలనలో ఆలస్యం చేయకుండా, విధివిధానాల ప్రకారం కేసులను పరిష్కరించి ప్రయోజనాలు అందించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తాజాగా మంత్రి వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది.

## విదేశీ విద్యపై తగ్గుతున్న ఆసక్తి

**ముద్ర డెస్క్ :**
ఒకప్పుడు మధ్యతరగతి విద్యార్థి కల.. ఉన్నత వర్గాల హోదా.. వెరసి 'విదేశీ విద్య'. కానీ గత రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఆ మోజు క్రమంగా తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది. 2023లో 9 లక్షలకు పైగా ఉన్న భారతీయ విద్యార్థుల సంఖ్య 2025 నాటికి 6.26 లక్షలకు పడిపోవడం గమనార్హం. కేవలం రెండేళ్ల వ్యవధిలో 31 శాతం క్షీణత నమోదు కావడం అనేది కేవలం ఒక సంఖ్య మార్పు మాత్రమే కాదు.. ఇది విద్యార్థుల ప్రాధాన్యతల్లో, ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంలో వస్తున్న పెనుమార్పులకు సంకేతం.

**కఠిన నియమాలు.. భారమైన కలలు**
భారతీయ విద్యార్థులకు అత్యంత ఇష్టమైన గమ్యస్థానాలైన కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇటీవల తమ వీసా నిబంధనలను ఉక్కుపాదంతో కఠినతరం చేశాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులను తీసుకెళ్లే అవకాశం లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. చదువు పూర్తయ్యాక అక్కడే ఉండి ఉద్యోగం చేసుకునే 'పోస్ట్–స్టడీ వర్క్ పర్మిట్' నిబంధనల్లో మార్పులు చేశారు.. ట్యూషన్ ఫీజులతో పాటు నివాస ఖర్చులు ఆకాశాన్ని అంటుతున్నాయి. రూపాయి విలువ పతనం కూడా మధ్యతరగతి కుటుంబాలకు ఈ భారాన్ని మోయలేనిదిగా మార్చేసింది.

**భద్రత , ఉపాధిపై సందిగ్ధత**
విదేశీ గడ్డపై ఇటీవల విద్యార్థులపై జరుగుతున్న దాడులు, జాతి వివక్ష ఘటనలు తల్లిదండ్రుల్లో ఆందోళన నింపుతున్నాయి. దీనికి తోడు, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమనం కారణంగా విదేశాల్లో చదువు ముగించినా ఆశించిన స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదు. భారీగా అప్పులు చేసి వెళ్లిన విద్యార్థులు, అక్కడ ఉపాధి దొరక్కపోతే ఆ అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్న వాస్తవాన్ని గ్రహిస్తున్నారు.

# భారత్–ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

**ముద్ర డెస్క్:**
మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత అస్థిర పరిస్థితుల్లో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన ప్రపంచ దౌత్య వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ముఖాముఖి భేటీలకే పరిమితం కాకుండా 27 కీలక రంగాలలో కుదిరిన ఒప్పందాలు ఇరుదేశాల మధ్య ఉన్న 'వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరో ఉన్నత శిఖరానికి చేర్చాయి. రక్షణ రంగానికి మాత్రమే పరిమితమైన గత సంబంధాలను కాదని ఇప్పుడు టెక్నాలజీ, వ్యవసాయం, డిజిటల్ ఎకానమీ వంటి ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల్లోకి ఈ బంధం విస్తరించడం విశేషం.



**సాంకేతికత.. సరికొత్త వారధి**
ఈ పర్యటనలో ప్రధానంగా ఆకట్టుకున్న అంశం డిజిటల్ విప్లవం. భారత్‌లో సంచలనం సృష్టించిన యూపీఐ చెల్లింపుల వ్యవస్థను ఇజ్రాయెల్‌లో ప్రవేశపెట్టేందుకు మొగ్గు చూపడం, 2 దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను సులభతరం చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఇజ్రాయెల్ ప్రపంచానికి గురువు వంటిది. అటువంటి దేశంతో భారత్ చేతులు కలపడం ద్వారా మన స్టార్టప్ ఎకోసిస్టమ్, డిజిటల్ మౌలిక సదుపాయాలకు భారీ ఊతం లభించనుంది.

**అన్నదాతకు అండగా..**
భారతదేశం లాంటి వ్యవసాయ ఆధారిత దేశానికి ఇజ్రాయెల్ అందించే సహకారం వెలకట్టలేనిది. ఇప్పటికే రాష్ట్రాల్లో ఉన్న 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' సంఖ్యను 100కి పెంచాలని నిర్ణయించడం సామాన్య రైతుకు మేలు చేసే పరిణామం. చుక్క నీటిని కూడా వృధా చేయని ఇజ్రాయెల్ డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ మన సాగు పద్ధతులను మార్చబోతోంది. తక్కువ వనరులతో ఎక్కువ దిగుబడి సాధించే మెళకువలు భారతీయ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతాయి.

**ఉగ్రవాదంపై ఉమ్మడి సమరం**
ఉగ్రవాద బాధిత దేశాలుగా భారత్, ఇజ్రాయెల్ ఈ విషయంలో ఎప్పుడూ ఒకే మాటపై ఉన్నాయి. తాజా ఒప్పందాల ప్రకారం ఇంటెలిజెన్స్ షేరింగ్ , కౌంటర్ టెర్రరిజం టెక్నాలజీలో పరస్పర సహకారం మరింత పెరగనుంది. ఇది సరిహద్దు భద్రత విషయంలో భారత్‌కు పటిష్టమైన రక్షణ కవచం అందిస్తుంది.



**ఆర్థిక ప్రయోజనాలు.. ఎఫ్.టీ.ఏ దిశగా..**
త్వరలో కుదరనున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్.టీ.ఏ) ఇరుదేశాల వాణిజ్య రంగానికి గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఒప్పందం అమలైతే సుంకాల తగ్గింపు ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతుంది. ఐటీ, ఫార్మా, ఆభరణాల రంగాల్లో భారీగా పెట్టుబడులు రావడమే కాకుండా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మొత్తంగా చూస్తే ప్రధాని మోదీ పర్యటన కేవలం ఒక దౌత్య కార్యక్రమం మాత్ర మే కాదు.. ఇది భారతదేశపు 'నేషనల్ ఇంట్రెస్ట్' జాతీయ ప్రయోజనం.. ఇజ్రా యెల్ యొక్క 'టెక్నాలజీ ఎడ్జ్' కలయిక. మధ్యప్రాచ్య రాజకీయ సంక్షోభాల మధ్య భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని చాటుతూనే తన అభివృద్ధికి అవసరమైన భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకుంది. 27 ఒప్పందాలు కేవలం కాగితాల మీద సంతకాలు కాకుండా క్షేత్రస్థాయి లో అమలైతే రెండు దేశాల ప్రజల జీవితాల్లో మార్పులు రావడం ఖాయం.

### మురుంటావ్ గని (ఉజ్బెకిస్తాన్)

ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఓపెన్ పిట్ గోల్డ్ మైన్. సంవత్సరానికి భారీ స్థాయిలో బంగారం ఉత్పత్తి చేస్తుంది.



# వేధించిన వారిని వదలను

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- పోలీసు ఉన్నతాధికారులు వారికి వారే చిక్కులు కొని తెచ్చుకుంటున్నారు



**ముద్ర, హుజూరాబాద్ :**

చెప్పని మాటలు చెప్పినట్టు అభూత కల్పనలు సృష్టించి తనను వేధిస్తోన్న వారు ఎంతటి వారైనా ఎవరినీ వదలే ప్రసక్తే లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో మళ్లీ అధికారంలో రావడం ఖాయమన్న ఆయన అప్పుడు అందరికీ వడ్డీతో సహా చెల్లిస్తానని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు వారికి వారే చిక్కులు కొనితెచ్చుకుంటున్నారని హెచ్చరించారు. గురువారం హుజూరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ మతమార్పిడులకు పాల్పడుతున్నారని తాను అన్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకోవడానికి కూడా సిద్ధమేనని సవాల్ చేశారు. కరీంనగర్ సీపీని అసలు ఆ మాట అనలేదని స్పష్టం చేశారు. తనను వేధించాలనే తప్పుడు కేసు నమోదు చేసి సీఐడీతో విచారణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ మేడారం జాతరకు 50 మందితో వెళ్లానని చెబుతోన్న పోలీసులు.. అంతమందితో వెళ్లినట్లు నిరూపిస్తే క్షణం ఆలోచించకుండా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. అధికార పార్టీ, అందులో పని చేసే కొందరు ఉన్నత స్థాయి అధికారులు కావాలనే తనను టార్గెట్ చేశారన్నారు. ఇదీలావుంటే ఈ వ్యవహారంపై పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి క్షమాపణలు చెప్పారు. 'ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో నాపై, నా కుటుంబంపై రాజకీయ కక్షకు తెగబడ్డారని అన్నారు. పోలీసులు, అధికారులు అంటే గౌరవం ఉందని, ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నానని చెప్పారు.



# మంచిర్యాల, ఆసిఫాబాద్ లో భూకంపం

- తీవ్రత 3.9గా గుర్తింపు
- మహారాష్ట్ర సరిహద్దులోనూ కంపించిన భూమి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో రెండు జిల్లాల్లో భూకంపం సంభవించింది. మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం అర్ధరాత్రి భూమి కంపించింది. రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 3.9గా గుర్తించారు. మంచిర్యాలకు 35 కిలోమీటర్ల దూరంగా భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దులో సైతం భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్టు సమాచారం. మరోవైపు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో 3 సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ఇళ్లలోని వస్తువులు ఒక్కసారిగా కిందపడ్డాయి. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు భూమి కంపించడంలో లేచి బయటకు పరుగులు తీశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం భూకంపం వల్ల వస్తువులు కదిలిన సీసీ టీవీ ఫుటేజ్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే కొన్ని నెలల క్రితం సైతం రాష్ట్రంలో భూమి కంపించిన సంగతి తెలిసిందే. కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో భూమి కంపించింది. ఆ సమయంలో ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

# తెలంగాణ ప్రజలు ఆధిపత్యాన్ని సహించరు..

- సీఎం రేవంత్‌రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**



తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. "బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్ 1, 171 మంది గ్రూప్2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# భూదాన్ భూములపై ముగ్గురి కన్ను

- అందుకే నోటీసులు ఇవ్వకుండా పేదలను రోడ్డున పడేశారు
- స్వార్థ రాజకీయాల కోసం ప్రజలు, అధికారుల మధ్య చిచ్చు పెడుతున్నారు
- అక్రమ కూల్చివేతలపై శాసనసభ, మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, ఖమ్మం :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు అక్రమ సంపాదన కోసం 62 ఎకరాల భూదాన్ భూములపై కన్నేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అందులో భాగంగానే ఆయా భూముల్లో నివసిస్తోన్న పేదలకు నోటీసులు కూడా ఇవ్వకుండా రోడ్డున పడేశారని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజలు, అధికారుల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కచ్చితంగా ఇళ్ల కూల్చివేత పాపం మంత్రులు పొంగులేటి, భట్టి, తుమ్మలదేనన్నారు. వారికి పేదల ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. ఆ భూములకు సంబంధించి ప్రజల వద్ద ఉన్న పట్టాలు సక్రమమేనన్న కేటీఆర్.. కాంగ్రెస్ నేతల బుద్ధే వంకర అన్నారు. దేశంలో ఒకప్పుడు ఒరిజినల్ గాంధీలు ఉండేవారనీ ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు ఉన్నారన్నారు. గురువారం ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పర్యటించిన కేటీఆర్.. భూదాన్ భూ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి కొట్లాడామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎసే అధికారంలో వస్తోందని కేటీఆర్ జోస్యం చెప్పారు. అప్పుడు తమ ప్రభుత్వం మీకు ఇల్లు కట్టిస్తుందని హామీ ఇచ్చారు. ఇది తన బాధ్యత అని భరోసా ఇచ్చారు. అక్రమ కూల్చివేతల గురించి శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమా? అని ప్రశ్నించారు. శత్రుదేశం మీద దండయాత్రకి పోయినట్లు 4వేల మంది పోలీసులతో పేదల మీద దాడి చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావులను ఇక్కడికి రమ్మనండి అని సవాల్ చేశారు. ఏ తప్పు జరగకపోతే ఆర్డీవోను ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు.. ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకడిని బలి పశువు చేసి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మరోవైపు బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని కేటీఆర్‌కు వివరించారు. వెలుగుమట్లలోని 147, 148, 149 సర్వే నంబర్లలో 60 ఎకరాల భూదాన్ భూమి ఉండాల్సి ఉండగా.. తాము గుడిసెలు నిర్మించుకున్నది కేవలం 30 ఎకరాల్లోనే అని అధికారులు చెప్తున్నారని, మరి మిగిలిన 30 ఎకరాలు ఏమయ్యాయో అడగాలని బాధితులు కేటీఆర్‌ను కోరారు. కాగా, దశాబ్దం క్రితం ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం నగరానికి వచ్చి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవడమే మేము చేసిన పాపమైందా? భూదాన్ భూముల్లో నివాసముంటున్న పేదలపై పెద్దలకు ఎందుకింత కంటగింపు అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు.





# హైదరాబాద్ లో ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్

- సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఖర్చుతో కూడిన ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ ను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందన్న ఆయన రానున్న రోజుల్లో ఆ శిక్షణ హైదరాబాద్ లోనే అందిస్తామన్నారు. విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ ను తీసుకుంటామన్నారు. అలాగే మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని వివరించారు. గురువారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్, కాచిగూడలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం వారు మంత్రి అడ్లూరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్‌లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. సివిల్స్, గ్రూప్-1 గ్రూప్-2 కోచింగ్ కోసం మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రాతినిధ్యం పెరిగేలా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని చెప్పారు. తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామన్నారు. పేద విద్యార్థి నుంచి ఒక మంచి అడ్మినిస్ట్రేటర్‌గా (పరిపాలకుడిగా) తీర్చిద్దిదాలనే అనే సంకల్పంతో మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అరాచక పాలన పై మౌనమేల...?

- రాహుల్ గాంధీకి ఎంపీ ఈటల సూచన
- పేద ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానంపై దాడి జరుగుతోంది
- తెలంగాణ పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం



**ముద్ర, న్యూఢిల్లీ :**

తెలంగాణలో కొనసాగుతోన్న అరాచక పాలన... పేద ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానంపై జరుగుతోన్న దాడుల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలుసుకోవాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. సీఎం రేవంత్ దుర్మార్గాలను రాహుల్ గాంధీ ఆపాలన్న ఆయన.. లేదంటే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం పట్టుకుని తిరుగుతోన్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పాలన ఉన్న రాష్ట్రంలో మీరు చేస్తుంది ఏంటి? అని నిలదీశారు. ఖమ్మంలో ఇంటికో డీసీఎం పంపి కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో పెద్దలు రూ.వేల కోట్ల భూములు అక్రమించుకుంటే పట్టించుకోవడం లేదన్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ వద్ద 120 ఎకరాలు ప్రభుత్వ భూమి అక్రమించుకుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదల ఇళ్లు మాత్రం కులగొడుతున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన పేరుతో వందల ఇళ్లను ఖాళీ చేయడం, కూల్చడాన్ని ఖండించారు. మధు పార్క్ అపార్ట్ మెంట్‌లో నివసిస్తున్న ప్రజల ఆవేదన ప్రభుత్వానికి అర్థం కావడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అవుతున్నా పేదలకు భూములు, ఇల్లు ఇవ్వకుండా ఉన్న ఇళ్లను కూలగొడుతున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో పేదల ఇండ్లు కూలగొట్టడాన్ని ఖండించారు. ఇల్లు కోల్పోయిన పేదలకు తక్షణమే ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం పేరుతో బుకాయిస్తే ఖబర్దార్.. అంటూ హెచ్చరించారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో గాంధీ పార్క్ కట్టుకోవాలన్నారు. కేంద్రం అభివృద్ధి కోసం భూములు ఇచ్చిందన్న ఆయన పేదలను ఇబ్బంది పెట్టడానికి కాదన్నారు. ఫీజు రీ ఎంబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ మందులు, బకాయిలకు, డైట్ చార్జీలకు నిధులు లేవని చెప్పి రూ.5 వేల కోట్లు పెట్టి గాంధీ పార్క్ కడతామంటున్న సీఎం.. ముందు అవి చేసి తర్వాత ఏదైనా కట్టుకోవాలని సలహా ఇచ్చారు.

# భారీగా ఐఏఎస్ ల బదిలీలు

- 45 మందికి స్థానచలనం
- జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా
- పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్
- జితేశ్ వి.పాటిల్ కు ఎస్పీడీసీఎల్ సీఎండీ బాధ్యతలు
- విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్
- మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఏకంగా 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది.




**సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)**

**ముఖ్యకార్యదర్శి - రాహుల్ బొజ్జా**

పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్

ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్

కొత్త డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూకీ

ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్

ఐటీ అండ్ సీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్

ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం సెక్రటరీ గౌరవ్ ఉప్పల్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దాన కిషోర్

ఫైనాన్స్ శాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్

ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.ఎం.సంతోష్

లేబర్ స్పెషల్ కమిషనర్ పమేలా సత్పతి

కో ఆపరేటివ్ కమిషనర్ పి.ఎస్.రాహుల్ రాజ్

దేవాదాయశాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు

ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి డి.దివ్య

మహబూబ్‌నగర్ కలెక్టర్ బి.విజయేంద్ర

కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా

హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్

యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి

జనగాం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబర్ష్

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 27.02.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పు వచ్చేదెన్నడు..?

అధికారం అవినీతికి దారితీస్తుంది, మరియు సంపూర్ణ అధికారం సంపూర్ణ అవినీతికి దారితీస్తుంది." – లార్డ్ ఆక్టన్ అన్నారు
"అవినీతికి వ్యతిరేకంగా పోరాటం కేవలం ఒక విధి కాదు; అది ఒక నైతిక అత్యవసరం." – కోఫీ అన్నన్ అన్నారు
"అవినీతి వ్యభిచారం కంటే దారుణమైనది. రెండోది ఒక వ్యక్తి యొక్క నైతికతకు హాని కలిగించవచ్చు; మొదటిది ఎల్లప్పుడూ మొత్తం దేశం యొక్క నైతికతకు హాని కలిగిస్తుంది." – కార్ల్ క్రాస్ అన్నారు
"మీరు అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడనప్పుడు, మీరు దానిని వృద్ధి చెందనిస్తారు." – డెస్మండ్ టుటు అన్నారు అవినీతి మంచు బంతి లాంటిది: అది దొర్లడం ప్రారంభించిన తర్వాత, అది పెరగాలి." – చార్లెస్ కాలేబ్ కోల్టన్
"మీరు అవినీతిపై పోరాడితే, అది తిరిగి పోరాడుతుంది."
"అవినీతి పురోగతికి శత్రువు." – జాన్ ఎఫ్. కెన్నెడీ
లంచం అనేది నాయకత్వానికి ఊబి లాంటిది." – జార్జి వాషింగ్టన్
"అవినీతి అంటే అధికారం ప్లస్ గుత్తాధిపత్యం మైనస్ పారదర్శకత."
–అవినీతి గెలవాలంటే అవసరమైన ఏకైక విషయం ఏమిటంటే మంచి వ్యక్తులు ఏమీ చేయకపోవడమే." – ఎడ్మండ్ బర్క్
"అవినీతి మరింత అవినీతిని పెంచుతుంది." –
"న్యాయం అమ్మకానికి లేదు." – నెల్సన్ మండేలా
"ఎక్కడైనా అన్యాయం జరిగితే అది ప్రతిచోటా న్యాయానికి ముప్పు." – మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్.

ఇలా ప్రసిద్ధ వ్యక్తులు అవినీతి గూర్చి సమాజానికి వివరించారు చేప నీళ్లు తాగడము,ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకోవడం చూడలేము అన్నారు పూర్వ కాలము లో చాణుక్యుడు.అవినీతి అవినీతిని ప్రస వించుతుంది.శిక్ష మినహాహింపు సంస్కృతి ని పెంచుతుంది"



అవినీతి ,అవినీతి.తెలంగాన రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినాక కూడా చేతులు తడపందే ప్రభుత్వ కార్యాలయాల్లో పని అయ్యే పరిస్థితులు లేవు. అనువు అనువునా అవినీతి విశ్వవ్యాప్తం అయినది.అవినీతి,అధికారం నానానికి రెండు ముఖాలుగా మారిపోయినాయి. మన దేశంలో,రాష్ట్రం లో ఎయిడ్స్ మహమ్మారి కన్నా అవినీతి మహమ్మారి వేగంగా విస్తరించింది.దక్షిణ ఆసియా దేశాలలో నే కాక యావత్ దేశాలలోను అవినీతి బాగ ప్రబలిన దేశాలలో భారత్ ఒకటిగా నిలిచింది.ట్రాన్స్ పరెనసి ఇంటర్నేషనల్ అధ్యయనం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల లో పనుల నిమిత్తం 75 శాతం ప్రజానీకం లంచాలు చెల్లించుకొవాల్సిన అవసరం ఏర్పడుతుందనీ తెలుస్తుంది.ఇటీవల విడుదల చేసిన సర్వే ప్రకారం.మన దేశంలో అవినీతి 83 వ స్థానం.లంచం ఇవ్వడం,తీసుకోవడం కూడా చట్ట రీత్యా నేరమే.ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కి పాల్పడి నపుడు ప్రజాదనమును అపహరించినపుడు ఉద్యోగం నుండి తొలగించడం సరి అయిన శిక్ష అని భారత సర్వోన్నత న్యాయ స్థానం కూడా పేర్కొంది.ప్రపంచము లో ని 176 దేశముల అవినీతి తో పోలిస్తే భారత్ రేటింగ్ 83 వ స్థానం లో వుంది.గత సంవత్సరం మన స్థాయి 92.పక్కన గల శ్రీలంక దేశ అవినీతి 79 వ స్థానం,రష్య 80 వ స్థానం,డెన్మార్క్ అధికముగ 90 వ స్థానం లో వుంది.అఫ్ఘానిస్తాన్, ఇరాన్,నేపాల్,పాకిస్థాన్,బంగ్లాదేశ్ దేశములు భారత్ కన్న ఎక్కవ స్థాయిలో వున్నాయి.మన దేశంలో అవినీతి ఎక్కువగా పెరిగి పోయింది.టెండర్ల లో గోల్ మాల్ వల్ల అవినీతి అధికంగా జరుగుతుంది అని తెలుస్తుంది.కొంత మంది కాంట్రాక్టరులు ఇష్టారాజ్యం గా వ్యవహరించడం జరుగుతుందని,చేపట్టిన పనుల లో నాణ్యత లోపించడం,పాలకులు,అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అప్పగించడం సాధారణంగా మారిపోయింది.రోడ్స్,ఆనకట్టలు,భవనాలు త్వరగా పాడైపోవడం,అలాగే రవాణా రంగం,ఆదాయపు పన్ను శాఖ,రెవెన్యూ,సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయము,పోలీస్,గనులలో , అవినీతి తార స్థాయికి చేరింది అని సర్వేలు చెబుతున్నాయి. అభివృద్ధి అవినీతిని కబలిస్తుంధి.ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు వరుస దాడులు చేసి అవినీతి చేపల్ని వల వేసి పట్టుకుంటున్నా అధికారులలో మార్పు రావడం లేదు.పూర్వం కీసర తహసీల్దార్ నాగరాజు అవినీతి ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ జనవరి నుండి ఇప్పటి వరకు సుమారు వివిధ ప్రాంతాల్లోవివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ ఉద్యోగులు యాభయి మంది వరకు అవినీతి నిరోధక శాఖ కు చిక్కారు.తాజాగా హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఇంచార్జ్ విద్యాధికారి తో పాటు మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు 60 వేలు లంచం తీసుకుంటూ ఏ సి.బి కి చిక్కారు.వారి ఇంటిలో సోదాలు చేయగా ముప్పై లక్షల నగతు దొరికింది

మహిళ అధికారులు కూడా లంచాలకు మరిగారు గతంలో జమ్మికుంట తహసీల్దార్ గా పనిచేసిన మహిళా అధికారి పట్టుబద్దారు. హన్మకొండ లో వారి ఇంటి మీద అవినీతి నిరోధక శాఖ అధికారులు పెద్ద ఎత్తున దాడులు చేసి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాధించినట్లు వెల్లడించారు.కీలక డ్యాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.వారం లో సుమారు పది మంది కి పైగా ఏదో ఒక ప్రాంతం లో అవినీతి అధికారులు అవినీతి నిరోధక శాఖ కు పట్టు బడుతూ వున్నారు.వారికి వచ్చే నెలసరి వేతనం సరిపోక విలాసవంతమైన బూములు,అపార్ట్మెంట్స్,బంగారం కొనుగోలు చేస్తున్నారు.ఎక్కువగా వారి బందు మిత్రులు పేర్ల మీద బినామీ గా వుండేలా రిజిస్ట్రేషన్ చేసుకుంటూ ఎవరి కంట పడకుండా జాగ్రత్త పడుతున్నారు.అవినీతి నిరోధక శాఖ వారు కూడా ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందు వున్నారు.ప్రజలలో ప్రశ్నించే హక్కు,అధికారులలో జవాబుదారీ తనం పెరిగినప్పుడె అవినీతి తగ్గుతుంది.లంచం ఇవ్వడం,తీసుకోవడం నేరమే అనే భావన అందరిలో కలగాలి.అవినీతి లేని సమాజం ని నిర్మించడం మన హక్కు.అవినీతి అంతం మన పంతం కావాలి.అవినీతి అధికారులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలి.ప్రతి గ్రామా,గ్రామాన ,పట్టణాలలో అవినీతి నిరోధక శాఖ అధికారుల ఫోన్ నంబరు లను గోడ లమీద రాయించాలి.టోల్ ఫ్రీ నంబరు 1064 గురించి విస్తృతం గా ప్రచారం చేయాలి.



కామిడి
సతీష్ రెడ్డి
జయశంకర్
భూపాలపల్లి జిల్లా...
9848445134..

# మట్టి కుండల నీరు శరీరానికి ఆరోగ్యకరం

మట్టి గుండెలో పుట్టిన నేనొక చిన్న కుండని
చేతి చెమటతో చెక్కిన కళాకారుని బొమ్మ.
చక్రం మీద తిరిగే ప్రతి క్షణం,
జీవితం కూడా అలా తిరుగుతుందనిపించింది నాకు.
అగ్ని పరీక్షలో గట్టిపడి,
ఊరంతా దాహం తీర్చే స్నేహితినయ్యా.
చల్లని నీటిలో నా ప్రాణం దాగి,
మనసులకూ చల్లదనమే పంచాను.
కొన్ని సార్లు పగిలినా బాధలేదు,
మళ్లీ మట్టిగా మారి నేలలో కలిసిపోతాను.
మనిషి జీవితం కూడా నాదిలానే కద
వచ్చి పోయే ఒక చిన్న ప్రయాణమేమట్టి కుండ నీరు ఆరోగ్యకరము



రాష్ట్రములో ఎండ తీవ్రత పెరుగుతుంది వేసవి కాలంలో మట్టి కుండలోని నీటిని తాగడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు. ఫ్రిజ్ నీళ్ల కంటే కూడా మట్టి కుండలోని నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒకప్పుడు మట్టికుండలతో వంటకాలు చేసుకునే వారు. రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలుగా ఉండేది. మట్టి కుండల్లో తయారైన భోజనాన్ని రుచి చూసిన ఆనాటి తరం వారు ఆరోగ్యంగా జీవించారు. కాలక్రమేణా మట్టి కుండల్లో వంటకాలు కనుమరుగయ్యాయి. అయితే కుండ నీటికి మాత్రం ఆదరణ తగ్గలేదు. రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఒక వైపు పర్యావరణ నిపుణులు, వైద్యులు మట్టికుండలోని నీటిని తాగడంతో పోషక విలువలతో ఆరోగ్యానికి మేలవుతుందని చెబుతున్నారు.కుమ్మరి కుండలకు రాష్ట్ర వ్యాప్తంగా గిరాకీ ఉంది

వేసవి కాలంలో వీటికి మరింత గిరాకీ పెరుగుతుంది. చాలా మంది ఈ వేసవిలో మట్టి కుండలోని నీటిని తాగడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ నీరు మరీ చల్లగా ఉండకుండా తాగేందుకు అనుకూలంగా ఉండటమే ప్రధాన కారణం. శీతోష్ణస్థితి ఆధారంగా మట్టి కుండలు నీటిని చల్లబరుస్తాయి.కుండలు, రంజన్ బిందెలు, కూజలు,తదితర కుండలు మార్కెట్ లో విక్రయిస్తున్నారు. ఒక్కో కుండ 10, 20, 30 లీటర్ల సామర్థ్యం ఉంటాయి. వీటి ధర మార్కెట్లో 100 రూ.200 నుంచి రూ.300, రూ.500 వరకు ఉంటుంది. వాటితో పాటు కూరలు, అన్నం వండే వంట పాత్రలతో పాటు పెరుగు కోసం కూడా ప్రత్యేక పాత్రలు కూడా అంతటా లభ్యమవుతున్నాయి. అయితే హైదరాబాద్ ఆదిలాబాద్ లో తయారుచేసిన మట్టి కుండలను రాష్ట్రం లోని అన్ని జిల్లాలు పట్టణాలకు తదితర ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తుంటారు.

గతంతో పోల్చితే తగ్గిన వ్యాపారం

గతంలో కొన్ని చెరువుల్లోనే మంచి బంకమట్టి లభించేది. ఈ మట్టిని తీసుకవచ్చి కుండలను తయారు చేసేవారు. అయితే ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లోని చెరువులు కాలుష్య బారినపడటంతో నాణ్యమైన బంకమట్టి లభించడంలేదు. దీంతో సిద్దిపేట్, మెదక్ కరీంనగర్ ఆదిలాబాద్ దూరప్రాంతాల్లోని చెరువుల నుంచి బంకమట్టిని తీసుకొచ్చి కుండలను తయారుచేయడం కుమ్మరి కులస్థులకు కష్టంగా మారింది. దీనికి తోడు వీటిని కాల్చడానికి కావల్సిన కట్టెల ధరలు కూడా పెరగడంతో తీవ్ర ఇబ్బందులుతలెత్తుతున్నాయి.నాణ్యమైన బంకమట్టి దొరకక ఇబ్బందులు పడుతూ ఉన్నారు

ప్రస్తుతం.. కుండలను తయారుచేసి విక్రయించడం కష్టంగా మారింది. కుండల తయారీకి ప్రత్యేకంగా బంకమట్టిని ఉపయోగిస్తాం. అయితే చెరువులు పూర్తిగా కలుషితం కావడంతో ఇక్కడి బంకమట్టితో కుండలు తయారీ చేయలేకపోతున్నాం. నాణ్యమైన బంకమట్టి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సిద్దిపేట్, మెదక్ నుంచి ట్రాలీలో తీసుకొస్తున్నాం. దీంతో రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దానికి తోడు కుండలను కాల్చడానికి కావల్సిన కట్టెల ధరలు కూడా పెరిగాయి. అయినా కులవృత్తులను వదులుకోకుండావ్యయప్రయాసాలతో అన్నం, కూరలు వండే పాత్రలను కూడా తయారు చేస్తున్నారు మట్టి పాత్రలను ఆదరిద్దాం కుమ్మరి కులస్తులను గౌరవిద్దాం ఈ వేసవి లో అందరం మట్టి కుండల నీరు త్రాగుదాం ఆరోగ్యం గా ఉందాం

– కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
9848445134

# ఒత్తిడి వద్దు.. ఆత్మవిశ్వాసమే హద్దు



విద్యార్థి ఒత్తిడి వద్దు
ఆత్మ విశ్వాసమే హద్దు
విజయమే నీ పద్దు

విద్యార్థి పోలికలు వద్దు
స్వయం పోటీయే ముద్దు
విద్యార్థి టెనేషన్ వద్దు
అటెన్షన్ ముద్దు

విద్యార్థి ఆందోళన వద్దు
ఆలోచనే ముద్దు
విద్యార్థి ఆలోచించు
విశ్లేషించు

విద్యార్థి స్పందించు
ఆశయాలను సాధించు
విద్యార్థి అధ్యయనం చేయు
అవగాహన పెంచుకో

విద్యార్థి అభ్యసనం అలవాటైతె
అనువర్తనం పరివర్తనమౌతది
విద్యార్థి విశ్లేషణ వివరణ విమర్శ విస్తృతమైతే
సమర్పణ సృజన సామర్థ్యాలు
ఇనుమడిస్తాయి

సమయ పాలన పాఠ్యాంశాలపై
సాధికారిత సత్ ఫలితాలిస్తాయి
విద్యార్థి షార్ట్ కట్స్ వద్దు స్మార్ట్ వర్క్ ముద్దు
సులభ సమాధాన ప్రశ్నల
ఎంపిక సమయపాలన
పరీక్షలో కలిగే ఫోబియాను
దూరం చేస్తాయి
కటిన ప్రశ్నలకు జవాబు
రాసే విశ్వాసం ఏర్పడుతుంది
పరీక్షల్లో విజేతగా నిలుపుతుంది

విద్యార్థి సృజన సన్మార్గమైతె
విజయాలు సిద్ధిస్తాయి
విద్యార్థి విజయ సాధన కాంక్ష
నిరంతరం వెలిగే జ్యోతి కావాలి

సృజనాత్మకత పట్టుదల
పెట్టుబడి కావాలి
విద్యార్థి పరీకల్లో కాపీ తాత్కాలిక విజయం

జీవితంలో షార్ట్ కట్స్ వద్దు
జ్ఞానం శీలం జీవన సాఫల్యతకు మార్గం కావాలి

విద్యార్థి ఒత్తిడిని పక్కన బెట్టు
చదువు పై దృష్టి పెట్టు
తల్లి తండ్రులు పాజిటివ్ దృక్పథం తో విద్యార్థి లక్ష్య సాధనకు సహకరించాలి

పిల్లలపై భారీ అంచనాలు వద్దు
నచ్చిన రంగాల్లో రాణించేట్లు విద్యార్థి
మనసును ఎరిగి టీచర్స్ బోధించాలి
ప్రోత్సహించడమే ముద్దు

విద్యార్థి మనోప్రశాంతత
ఆత్మవిశ్వాసం ప్రతిభా పాటవాలకు
ఉద్దీపనం కావాలి
యావరేజే అద్భుతాలకు ఆలంబన కావాలి
విద్యార్థి ఆత్మన్యూనత విడనాడాలి

నైపుణ్యాభివృద్ధితో శ్రమయేవ జయతే
జీవన శైలి కావాలి
విద్యార్థి రాంకుల కొరకు
పరుగు వద్దు
రాణింపే మంత్రం కావాలి
పఠనాసక్తే తంత్రం కావాలి
వివేచన విచక్షణ యంత్రం
కావాలి

సమయ పాలనతో స్వావలంభన
సమయాన్ని సృజనను సన్మార్గంలో
పెడితే అద్భుతాలు ఆవిష్కృతమౌతాయి

విద్యార్థి జీవిత కాల చక్రంలో వచ్చే
మార్పులను ప్రతిభను గుర్తిస్తే
విజయాలు రాజ్యమేలుతాయి

విద్యార్థి ఆన్లైన్ గేమ్స్
సోషల్ మీడియా వద్దు
సోషలైజేషన్ హద్దు
పుస్తకాలకు దగ్గరగా
గ్యాడ్జెట్స్ రహితంగా
ప్రతి ఇల్లు టెక్నాలజీ ఫ్రీ జోన్
కావాలి
గ్యాడ్జెట్ల బానిసత్వం వద్దు
టెక్నాలజీ ఉపవాసం ముద్దు
జీవితంలో ఉల్లాసం
ఉత్సాహం ఉప్పొంగాలి

మాతృబాషపై మమకారం
ప్రాంతీయ భాషపై ఆసక్తి
ప్రాచీన భాషలపై అభిమానం

భారతీయ సంస్కృతి చరిత్ర వారసత్వ సంపదపై అవగాహన చైతన్యం
పెంచుకొని భారత జాతి ప్రతిభా ఔన్నత్యాన్ని
ప్రపంచానికి చాటాలి
విశ్వ విజేతలుగా నిలువాలి
జగతిన వెలుగులు నింపాలి

- నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎడ్యుకేషన్ ఫోరం
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్ 9440245771


# సమ్మిళిత సుస్థిరాభివృద్ధిలో ఎన్జీవోల భాగస్వామ్యం

**(నేడు "ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం" సందర్భంగా)**

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను "ప్రభుత్వేతర సంస్థలు" లేదా "నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్)" అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోల పట్ల అవగాహన పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త "మార్కస్ లియర్స్ స్కద్మనిస్" నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం (వరల్డ్ ఎన్జీవో డే)" వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

## ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2026 ఇతివృత్తం:


ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమదానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం–2026 ఇతివృత్తంగా "సమ్మిళిత మూల సూత్రంతో సుస్థిరాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల ప్రాధాన్యాన్ని వివరించాడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్ర మాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు.




## భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు:

నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వుమన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్‌ఎయిడ్, చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలి యన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భా గ్యుల ముఖాల్లో ఆనంద భాష్పాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.



డాక్టర్. బుర్ర మధుసూదన్ రెడ్డి
సామాజిక విశ్లేషకులు
9949700037

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఒలింపియాడా గని (రష్యా)
రష్యాలో అతిపెద్ద గోల్డ్ మైన్. Polyus కంపెనీ నిర్వహణలో ఉంది, అధిక గ్రేడ్ ఖనిజంతో ప్రసిద్ధి.



## “మూసీ పేరుతో ఇళ్ల కూల్చివేతలా..?”

- **బాధితుల వద్దే నిరసనకు సిద్ధమని బిజెపి హెచ్చరిక**
- **ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచనలు**

**ముద్ర ప్రతినిధి, బండ్లగూడ :**



“మూసి పేరుతో ఇళ్ల కూల్చివేతలా..?” అంటూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి ప్రక్షాళన పేరిట ప్రజలను రోడ్డున పడేయడం సరి కాదని, ముందుగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి చెరువులు, నాళాలను శుభ్రపర చాలని సూచించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మూసి పరివాహక ప్రాంతాల్లో గురువారం పర్యటించి బాధితులతో మాట్లాడారు. పర్యటనను లంగర్ హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ నగర్, మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్లు, గంధం గూడా, విఘ్నేశ్వర నగర్, కేకే నగర్, గండిపేట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాధితుల సమస్యలు విన్నారు.

**ఇళ్ల కూల్చివేతలపై బిజెపి ఫైర్..**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నుండి కూడా హైడ్రా అని, ఫ్యూచర్ సిటీ అని, మూసి ప్రక్షాళన అని ఇలా ఎన్నో రకాలుగా రియల్ ఎస్టేట్ కోసం గడ్డపారలు పట్టుకొని ప్రజలపై దాడులకు దిగుతుందన్నారు. ప్రధాని మోడీ ఒక ఇల్లు కూడా కూల్చకుండా గంగా యమునా, సబర్మతిలను అభివృద్ధి చేశారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని టెక్నాలజీ ఉపయోగించి అడవిలో ఏర్పాటు చేశారని, దీనివల్ల అనేక ప్రాంతాల ప్రజలకు ఉపాధి దొరికిందన్నారు. ఇలా ప్రజలను రోడ్డుకు ఈడ్చకుండా వారికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలన్నారు. ముందుగా మల్కంచెరువు, దుర్గం చెరువు, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి, చెరువులునాళాలను శుభ్రపరచాలని అన్నారు. మూసికి లోతు పెంచి, ఇరువైపులా పటిష్టమైన ప్రహరీ గోడలు నిర్మించాలని సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక పత్రాన్ని ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు.

**ఆదిత్య హోమ్స్‌పై చర్యలేవి?**

మధు పార్క్ రిడ్జ్ నిర్మాణం నిబంధనల ప్రకారం జరిగిందని అధికారులే చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే ఓఆర్ఆర్ సమీపంలో ఆదిత్య హోమ్స్ నిర్మాణాల వల్ల వరదల సమయంలో ప్రాంతం నీటమునిగిందని ఆరోపించారు. బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వరదల ఫోటోలను ప్రదర్శించారు.

**కేంద్రానికి లేఖ..**

ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్నది అసత్యమని అన్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు లేఖ రాసినట్లు తెలిపారు. ప్రభుత్వం బలవంతంగా ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తే తామంతా బాధితుల ఇళ్ల వద్దే ఉండి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, అందే శ్రీరాములు, బండ కార్తీక రెడ్డి, శేఖర్ ముదిరాజ్, పాండు కుమార్, నాగేంద్ర ప్రకాష్ రెడ్డిలు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్

- **అడిషనల్ కలెక్టర్‌గా జి పనీందర్ రెడ్డి**
- **స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీగా సిక్త పట్నాయక్ బదిలీ**

**ముద్ర, నారాయణపేట:**

నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించిన సిక్త పట్నాయక్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె స్థానంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ప్రతీక్ జైన్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ప్రతీక్ జైన్ గతంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నారాయణపేట నుంచి బదిలీ అయిన సిక్త పట్నాయక్ జిల్లాలో మున్సిపల్, సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలో దీర్ఘకాలంగా సేవలందించిన ఆమెను సాధారణ బదిలీలలో భాగంగా స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీగా నియమించారు. అలాగే 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జి. పనిందర్ రెడ్డిని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం కేటాయించింది. అదేవిధంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ గా దీపక్ తివారి నియామకమయ్యారు.

## వీర సావర్కర్ వర్ధంతి

**ముద్ర, నారాయణపేట :**



హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన ప్రముఖ వ్యక్తి వీర సావర్కర్ అని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో వీర సావర్కర్ వర్ధంతిని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చౌరస్తాలో ఉన్న సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీర సావర్కర్ 1883 సంవత్సరంలో నాసిక్ సమీపంలోని భాగూర్ గ్రామంలో జన్మించారని తెలిపారు. వీర సావర్కర్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, రాజకీయ నాయకుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవ కార్యకలాపాలు నిర్వహించారని తెలిపారు. అభినవ భారత్ అనే విప్లవ సంస్థను స్థాపించారని చెప్పారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం కూడా గడిపారని వెల్లడించారు. వీర సావర్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మురళీ భట్టడ్, రవికుమార్ గౌడ్, అరవింద్, కడుదాస్ ప్రవీణ్, శ్రవణ్, మ్యాతరి ఆకాశ్, చక్రి, భోగం అన్వేష్, గిరీష్, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ డీఆర్ఓ బదిలీ

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ డీఆర్ఓ హరిప్రియ పదోన్నతిపై అదనపు కలెక్టర్ గా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి డీఆర్ఓ హరిప్రియను శాలువా పూల మొక్కతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా ఆదనపు కలెక్టర్ విజయెందర్ రెడ్డి తోపాటు కలెక్టర్ కార్యా లయంలోని పలువురు అధికారులు అభినందించారు.

## భవిత సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ముద్ర, పెబ్బేరు :**



ఉమ్మడి పెబ్బేరు మండల పరిధిలోని నాగసానీపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణ సమీపంలో భవిత సెంటర్ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ సుజాత రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ భవిత భవన నిర్మాణానికి 8 లక్షల రూపాయలు మంజురయ్యాయని ఆయన తెలిపారు. ఈ భవన నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తోడ్పడతామని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు నరేష్, ఉప సర్పంచ్ భరత్ కుమార్, వార్డు మెంబర్ రాముడు, తిరుపతయ్య, కురుమయ్య, శేఖర్, వీరబ్రహ్మం, హరీష్, భాస్కర్, కిషోర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ బదిలీ

**పదోన్నతిపై మెదక్ జిల్లా కలెక్టర్ గా నియామకం**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆమెను మెదక్ జిల్లా కలెక్టర్గా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2019 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ప్రతిమా సింగ్ మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా పనిచేస్తూ రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారు. బదిలీ అనంతరం రంగారెడ్డి జిల్లాలోనూ ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో అమయ్ కుమార్ కలెక్టర్ గా ఉన్నపుడు అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమా సింగ్ ఆ తర్వాత కలెక్టర్ హరీష్, ప్రస్తుత కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కూడా పని చేశారు. జిల్లాలో రెండున్నరేళ్లకు పైగా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఆమె మధ్యలో ఆరు నెలలపాటు ప్రసూతి సెలవుపై వెళ్లి గత వారమే తిరిగి విధుల్లో చేరారు. సౌమ్యురాలిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతిమా సింగ్ జిల్లాలో సమర్థవంతమైన, చురుకైన అధికారిణిగా అంతే స్థాయిలో ప్రజల నుండి ప్రశంసలు పొందారు. కాగా మెదక్ జిల్లాలో అదనపు కలెక్టర్ గా విధులు నిర్వర్తించిన ప్రతిమా సింగ్ పదోన్నతిపై తిరిగి అదే జిల్లాకు కలెక్టర్ గా నియమితులవడం విశేషం.

## నేటి నుంచి బీకేఎస్ అఖిల భారత మహాసభలు

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**




హైదరాబాద్ శివారులోని ఘట్కేసర్ మండలం అన్నోజిగూడ ఆర్వీకే పాఠశాల ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత మహాసభలు జరగనున్నాయి. ఈనెల 27 నుంచి మార్చి 1 వరకు మూడు రోజులపాటు జరగనున్న సభలను భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు కె.సాయిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా, అఖిల భారత సంస్థ కార్యదర్శి దినేష్ కులకర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ముదుగంటి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి శ్రీరంగారావు, ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనందరావు, కోశాధికారి లింగనోళ్ల మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన నున్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 1000 మంది భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మహాసభలకు తరలిరానున్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒక్కో రాష్ట్రం నుంచి 30 మంది ప్రతినిధులు అఖిల భారతీయ మహాసభల్లో పాల్గొనున్నారు. విత్తన చట్టాలు అన్నీ విత్తన ఉత్పత్తి కంపెనీలకు అనుకూలంగా ఉన్న దృష్ట్యా రైతులకు రక్షణ కల్పించడం కోసం ఆ చట్టాలను పునర్వ్యవస్థీకరించాలని, ఆ చట్టాల రూపకల్పనలో రైతుల భాగస్వామ్యం ఉండాలని ఈ మహాసభలు వేదికగా బీకేఎస్ కేంద్ర ప్రభుత్వానికి సూచించనుంది. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సేంద్రీయ వ్యవసాయం, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి, విజ్ఞాన కేంద్రాల భాగస్వామ్యం,నాబార్డు పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా చర్చినున్నామని బీకేఎస్ నేత, సీసీఎంబీ విశ్రాంత ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఏవీ రావు ఓ ప్రకటనలో తెలిపారు.



## మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఫైజాన్ అహ్మద్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు బదిలీపై వచ్చారు.

## మహబూబ్ నగర్ కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్ నగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ విజయెంద్ర బోయి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియమించబడ్డారు. అలాగే నారాయణ పేట కలెక్టర్ సిక్త పాట్నాయక్ ను ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ప్రదీప్ జైన్ కొత్త కలెక్టర్‌గా నియమించారు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పలువురు కీలక అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్ నగర్ అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) హరిప్రియను నియమించారు. ప్రస్తుతం ఆమె మేడ్చల్ డీఆర్ఓగా పని చేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా డీఆర్ఓగా పద్మజారాణి, ఇక్కడ జిల్లా హౌసింగ్ పీడీగా ఉన్న శ్రీనివాసరావును ఇక్కడే ఆర్డీవోగా నియమితులయ్యారు. ఇదే జిల్లా ఆర్డీఓగా పనిచేస్తున్న అలివేలు ను హౌసింగ్ పీడీగా నియమింపబడ్డారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ బదిలీలు జరిగాయని అధికారులు వెల్లడించారు.



## ఓపెన్ జిమ్ ప్రారంభం

**ముద్ర, శేరిలింగంపల్లి :**



వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్ రాజు నగర్ కాలనీలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటవిడుపు పరికరాలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ఏఎస్ రాజు నగర్ కాలనీలో ఓపెన్ జిమ్ ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే పిల్లలు, యువకులు, పెద్దలు, వృద్ధులు ఈ జిమ్‌ను వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటస్థలం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అందరూ విరివిగా మొక్కలు నాటి పార్కులను సంరక్షించాలని సూచించారు. ఆరోగ్య శేరిలింగంపల్లి నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని తెలిపారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మరిన్ని కాలనీలలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, నర్సింహ రావు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ. 2.5 లక్షల ఆర్థిక సాయం

**ముద్ర, బండ్లగూడ :**



తమ నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఆపద వచ్చినా సహాయం చేయడానికి ముందుంటామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. హైదర్ షాకోట్ పీజీ కాలనీలో నివసిస్తున్న బెల్లంకొండ వసంత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. వారి ఆర్థిక పరిస్థితి బాగోలేదని బండ్లగూడ జాగీర్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.5 లక్షల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆమె కుటుంబ సభ్యుడు మురళికి ఈ చెక్కును అందజేశారు.

## చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహించాలి

**ముద్ర, కాప్రా :**

ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆటో డ్రైవర్లను బాధ్యతాయుతంగా చైతన్యపరిచే కార్యక్రమం కుషాయిగూడలో నిర్వహించారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి, వ్యాపార స్థలాల నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించేలా వారికి అవగాహన కల్పించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలోని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ.. స్వచ్ఛమైన పరిసరాలు ప్రజల సహకారంతోనే సాధ్యమని తెలిపారు. చెత్త సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ సమయానికి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని ఆటో సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేర్వేరుగా వర్గీకరించి ఇవ్వాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా కుషాయిగూడ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏలు సునీల్, మనోహర్, కె. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 27-02-2026
www.mudranews.in | @mudranews



**కార్లిన్ ట్రెండ్ (అమెరికా)**



నెవాడాలో ఉన్న గోల్డ్ బెల్ట్, అనేక గనుల సముదాయం. ప్రపంచ గోల్డ్ ఉత్పత్తిలో ముఖ్యమైన భాగం ఇక్కడి నుంచే వస్తుంది.

# సమర్థవంతపాలన

**- కరీంనగర్ కొత్త కలెక్టర్ చిత్ర మిశ్రా ప్రస్థానం**



ముద్ర, కరీంనగర్:

కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా పాలనా పగ్గాలను ఐఏఎస్ అధికారిణి చిత్ర మిశ్రా చేపట్టారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి చిత్ర మిశ్రా అనతి కాలంలోనే సమర్థవంతమైన పాలకురాలిగా పేరు తెచ్చుకున్నారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం నుంచి గిరిజన ప్రాంతాల అభివృద్ధి వరకు ఆమె ప్రతి బాధ్యతలోనూ తనదైన ముద్ర వేశారు.

చిత్ర మిశ్రా 2020–21 కాలంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో శిక్షణా కాలాన్ని పూర్తి చేసుకున్నారు. శిక్షణ సమయంలోనే స్థానిక సమస్యలను అవగాహన చేసుకోవడంలో ఆమె ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు.

## నిజామాబాద్ జిల్లాలో కీలక సేవలు

జూన్ 2021 నుండి ఫిబ్రవరి 2024 వరకు నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఆమె విశేష సేవలు అందించారు. సెప్టెంబర్ 2021 నుండి జూలై 2023 వరకు నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. నగర పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ ప్రణాళికలో ఆమె తీసుకున్న నిర్ణయాలు ప్రజల ప్రశంసలు పొందాయి.

## ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా..

ఫిబ్రవరి 2024లో ములుగు జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, రెండేళ్ల పాటు (ఫిబ్రవరి 2026 వరకు) గిరిజన ప్రాంతాల అభ్యున్నతి కోసం శ్రమించారు.

"ప్రజలకు చేరువగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుంది" అనే నినాదంతో చిత్ర మిశ్రా తన విధులను నిర్వహిస్తున్నారు. యువ అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న చిత్ర మిశ్రా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆశిద్దాం.

# పరిపాలనతో తనదైన ముద్ర

**- కలెక్టర్ పమేలా సత్పతి కి వీడ్కోలు**

**- జిల్లా ప్రజల ప్రశంసలు అందుకున్న కలెక్టర్**

**- చెరగని చిరునవ్వుతో పరిపాలన తీరు భేష్**

ముద్ర ప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా పనిచేసి, బదిలీపై వెళ్తున్న పమేలా సత్పతి పరిపాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. జిల్లాలో అనేక వినూత్న కార్యక్రమాలకు చోదక శక్తిగా పమేలా సత్పతి ఉన్నారు. తరచుగా భిన్నంగా ఆలోచిస్తూ పేదల సంక్షేమం కోసం పనిచేస్తూ, అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమంలో ఒక ప్రత్యేక ముద్ర వేశారు. ఆమె తన అనేక సృజనాత్మక కార్యక్రమాల ద్వారా ప్రజల ప్రశంసలను పొందారు. జిల్లాలో ఎన్నో కార్యక్రమాలకు చోదక శక్తిగా పనిచేశారు. చెరగని చిరునవ్వుతో అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తూ ప్రతీ విషయంలో కరీంనగర్ జిల్లాను మొదటి స్థానంలో నిలపడంలో పమేలా సత్పతి ముందు వరుసలో ఉన్నారు.

ఒకవైపు రాజకీయ నాయకులతో, ప్రజా ప్రతినిధులతో, మరోవైపు జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ, పరిపాలన విషయంలో ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా నిర్వహించడంలో ఆమె కృతకృత్యులయ్యారు. అక్టోబర్ 2024 లో కరీంనగర్ కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న ఆమె వినూత్న రీతిలో విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచారు. భిన్నంగా ఆలోచిస్తూ పేదల సంక్షేమం కోసం పనిచేస్తూ, అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో అందరి ప్రశంసలు పొందారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ, సర్పంచ్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి తనదైన మార్క్ వేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్

ప్రజారోగ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించే చర్యలో భాగంగా, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి జూన్ 15, 2025న కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (GGH)లో సెప్టోప్లాస్టీతో పాటు ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ (FESS) చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

## సంజ్ఞా భాషలో జాతీయ గీతాన్ని పాడిన పమేలా..

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి భారతీయ సంజ్ఞా భాషలో జాతీయ గీతాన్ని ఆలపించారు. కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో వినికిడి లోపం ఉన్న విద్యార్థులతో కలిసి భారతీయ సంజ్ఞా భాషలో జాతీయ గీతాన్ని ఆలపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. కలెక్టర్ పమేలా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వినికిడి లోపం ఉన్న విద్యార్థులతో కలిసి సంజ్ఞా భాషలో గీతాన్ని ఆలపించగా మంత్రులు, అధికా



రులు ఎంతో ఆసక్తిగా విన్నారు. కాగా ప్రత్యేకమైన కార్యక్రమంపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశంసలు కురిపించారు. కరీంనగర్ జిల్లా అధికారులకు భారతీయ సంకేత భాష యొక్క ప్రాథమిక అంశాలపై ప్రత్యేక శిక్షణను ఏర్పాటు చేసారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం వారు వినికిడి లోపం ఉన్న సమాజం యొక్క సమస్యలను బాగా అర్థం చేసుకోవడానికి మరియు పరిష్కరించడానికి వీలు కల్పించింది.

## పిల్లల కోసం పాడిన పాట హైలైట్

అంగన్వాడీ పిల్లల కోసం కలెక్టర్ స్వయంగా ఒక పాట పాడి వారిని ఉత్తేజపరిచారు. ఆమె పాడిన 'ఓ చిన్ని పిచ్చుకా' అనే పాట ఎంతోమంది చిన్నారులను బడివైపు అడుగులు వేసేలా కదిలించింది.

జిల్లా కలెక్టర్ గా అన్ని వర్గాల ప్రశంశలు పొందిన పమేలా సత్పతి బదిలీపై వెళుతూ పరిపాలనలో తన మార్క్ చూపించారు.

# ప్రజల గుండెల్లో నిలిచిన పమేలా సత్పతి

ముద్ర, కరీంనగర్:

కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా గత రెండు సంవత్సరాలుగా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఐఏఎస్ అధికారి పమేలా సత్పతి బదిలీ జిల్లా వ్యాప్తంగా భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించింది. ఆమె సేవలు జిల్లాకు చిరస్మరణీయమని టిఎన్జిఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనను ఆయన జిల్లా కార్యదర్శి లక్ష్మణరావుతో విడుదల చేశారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, అనాథలకు ఆదరణగా మారిన ఆమె మానవతా దృక్పథం ప్రజల్లో విశేష ప్రశంసలు అందుకుంది. అభాగ్యులకు వివాహాలు జరిపించడం, ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులకు ధైర్యం నింపడం ద్వారా ఆమె ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసినట్లు తెలిపారు.

“ఆరోగ్య మహిళ” కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడమే కాకుండా, ప్రతి శుక్రవారం నిర్వహించిన ప్రజాసదస్సుల ద్వారా ప్రజల సమస్యలను స్వయంగా విని పరిష్కరించడం ఆమె ప్రత్యేకతగా నిలిచిందన్నారు. ప్రభుత్వ దవాఖానలో స్వయంగా చికిత్స చేయించుకోవడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంపొందించారని కొనియాడారు. ఉద్యోగులు, అధికారులు, ప్రజల మధ్య సమన్వయం నెలకొల్పుతూ అందరికీ ఆప్యాయతతో సేవలందించిన పరిపాలకురాలిగా ఆమె గుర్తింపు పొందారని చెప్పారు. ఆమెను ఉద్యోగులు గుండెల్లో పెట్టుకుని గౌరవించే స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు.

“జిల్లా కలెక్టర్లు వస్తారు, పోతారు... కానీ కొందరు మాత్రమే చరిత్ర సృష్టించి చరిత్రలో నిలిచిపోతారు. అలాంటి వారిలో పమేలా సత్పతి ఐఏఎస్ గారు ఒకరు” అని దారం శ్రీనివాస్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆమె సేవలు ఇంకొంతకాలం జిల్లాకు అందివుంటే కరీంనగర్ రూపురేఖలు మరింత మారిపోయేవని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

# నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బదిలీ





ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో కరీంనగర్ డి ఆర్వో వెంకటేశ్వర్లు ను నిర్మల్ అదనపు కలెక్టర్ గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**- కలెక్టర్ అభిలాష అభినవ్**

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు ఇప్పటి నుంచే పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గోదావరి పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. బాసర అమ్మవారి దర్శనానికి, గోదావరి నదిలో పుణ్యస్నానాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు దృష్టి సారించాలన్నారు. పార్కింగ్, వసతి, త్రాగునీరు, శాశ్వత, మొబైల్ టాయిలెట్లు, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలు




సమకూర్చాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, పటిష్ట నిఘా ఉంచుతామని వివరించారు. భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు పూర్తి చేసుకునేలా పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, డిపివో శ్రీని వాస్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, బాసర ఆలయ ఈవో విజయ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భారత పారా వాలీబాల్ సెలక్షన్ ప్యానెల్‌కు**

# సింగరపు బాబు ఎంపిక



ముద్ర, సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ కోచ్ తెలంగాణకు చెందిన సింగరపు బాబు 2026 ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు.

జపాన్‌లోని ఐచి–నగోయాలో జరగనున్న 2026 ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టును ఎంపిక చేయడానికి భారత పారాలింపిక్ కమిటీ ఆయనను సాంకేతిక పరిశీలకుడు మరియు ఎంపిక కమిటీ సభ్యుడిగా అధికారికంగా నామినేట్ చేసింది.

ఫిబ్రవరి 26 నుండి జరగనున్న 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ (పురుషులు & మహిళలు) సందర్భంగా భారత జట్టు ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు భారత పారాలింపిక్ కమిటీకి సింగరపు బాబు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి

**–జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**

ముద్ర, మహదేవపూర్:

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజాగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది, ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యా ర్థులు క్రీడల్లో రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత



స్థానాలకు చేరుకోవాలని సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జీవరత్నం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రుణాల మంజూరులో లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగాలకు రూ.2971.20 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంగా నిర్ణయించగా, డిసెంబర్ నెలాఖరు నాటికి రూ. 1937.21 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ), జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఎల్ఐసీ) సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాలకు సకాలంలో రుణాలు అందించాలని పేర్కొన్నారు. పంట రుణాలు పూర్తిగా చెల్లించిన రైతులకు రెన్యువల్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రెన్యువల్ కాక ఇబ్బందులు పడుతున్న వందమంది రైతులను చూపిస్తానని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆర్‌బీఐ ఎల్‌డిఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ డిజిఎం, టీజీబీ ఆర్ఎం, ఎల్‌డిఎం ఎ. తిరుపతి, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2026 పోస్టర్ విడుదల





ముద్ర, కరీంనగర్:

వికసిత్ భారత్ కరీంనగర్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు సంబంధించిన పోస్టర్ ను కేంద్రమంత్రి బండి సంజయ్ గురువారం విడుదల చేశారు. వికసిత్ భారత్ 2026 జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువతి, యువకులు పోటీలో పాల్గొనవచ్చు.

"50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ–లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ" అనే విషయం పై మూడు నిమిషాల పాటు హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో మాట్లాడడానికి అవకాశం కల్పించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 28 ఫిబ్రవరి 2026న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు మై భారత్ పోర్టల్ లో వికసిత్ భారత్ ఈవెంట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీసీ జీటీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, మేరా యువ భారత్ జిల్లా అధికారి ఎం. వెంకట రాంబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి.నితిన్ పాఠక్, టి. రాజయ్య, వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల సమన్వయకర్త బి. ఎలిజబెత్ రాణి అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్, కే. అర్జున్, వెంకటేశ్వర్లు, రాజేందర్, రాజేష్ పాల్గొన్నారు.

## వివాహానికి కౌన్సిలర్ దంపతుల ఆర్థిక సాయం



ముద్ర, హుజురాబాద్:

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 26 వార్డులో పేద కుటుంబాలకు చేయూతగా ఉంటామని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన భరోసా మేరకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య – నర్సింహారెడ్డి దంపతులు ఓ నిరుపేద కుటుంబంలో వివాహానికి ఆర్థిక సహాయం అందించారు. 26 వ వార్డుకు చెందిన నారోజు రాజ్యలక్ష్మి – రత్నా చారి దంపతుల కుమార్తె తరుణి వివాహం కందుకూరి రాజేందర్ తో గురువారం స్థానిక మధువని గార్డెన్ లో జరిగింది. ఈ వివాహ వేడుకకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నర్సింహా రెడ్డి దంపతులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి రూ.10,116 అందించి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ లావణ్య నర్సింహా రెడ్డి దంపతులను పలువురు అభినందించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

ముద్ర, కరీంనగర్:


కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరధి బొమ్మకల్, ఆరెపల్లి, కృష్ణా నగర్ ప్రాంతాల్లో గురువారం పోలీసులు దాడిచేసి 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న మల్లేష్, లక్ష్మీపతి, స్వామి దాస్, సత్యనారాయణ, సత్తయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బోడ్డింగ్టన్ గని (ఆస్ట్రేలియా)**

ఆస్ట్రేలియాలో అతిపెద్ద ఓపెన్ పిట్ గోల్డ్ మైన్. Newmont కంపెనీ నిర్వహణలో ఉంది.



## యాదాద్రి కలెక్టర్ గా అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



యాదాద్రి భువనగిరి కలెక్టర్ ఎం. హనుమంతరావు బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్ గా అనురాగ్ జయంతి. 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అనురాగ్ జయంతి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఇక్కడ ఇప్పటివరకు కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించిన హన్మంతరావు దేవదాయ శాఖ డైరెక్టర్‌గా నియమితుల

## శ్రీ వేంకటేశ్వరునికి తిరుప్పావడ సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రాతఃకాలంలో సుప్రభాత సేవతో ఆలయంలో నిత్య కైంకర్యాలు జరిగాయి. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వామి వారిని మాడ వీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.



## పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తనిఖీ చేశారు. గురువారం భువనగిరి లోని టైమ్స్ కళాశాల, భువనగిరి లోని శ్రీ చైతన్య కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయా అనే అంశంపై అదనపు కలెక్టర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రాల పంపిణీ విధానం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరు, తాగునీరు, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్విజిలేటర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మాల్ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరీక్షలను నిర్వహించాలని, విద్యార్థులందరూ ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలన్నారు.



## మాట తప్పని కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాల గూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్రా చారి ని గతంలో దత్తత తీసుకున్న కలెక్టర్. ప్రతి నెల అతని చదువుకు ఆర్థిక భరోసాని రూ.5వేలు ఇస్తూ వారి కుటుంబానికి నెల వారి సరుకులను అందిస్తున్నారు. భరతచంద్ర చారి కుటుంబం నివసించడానికి ఇల్లు లేకపోవడం, వారు ఇబ్బందులు పడుతున్నారు అని తెలుసుకొని ఉండటానికి ప్రభుత్వం తరుపున 225 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయించడంతో పాటు గురువారం ఇందిరమ్మ ఇంటికి కూడా భూమి పూజ చేశారు. భరత్ కి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తనకు బదిలీ అయిందని ఏ ఇబ్బంది వచ్చినా సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ, సబ్ ఇన్స్పెక్టర్, ఎంపీవో, పంచాయత్ సెక్రటరీ, సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు

# గరుడ వాహనంపై భక్తవత్సలుడు

- **శ్రీ మహావిష్ణువు అలంకారంలో యాదగిరి నరసింహుడు**
- **తిరువీధులలో అంగరంగ వైభవంగా దివ్య విమాన రథోత్సవం**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**





యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం ఉదయం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీ స్వామివారిని శ్రీ మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహన శేవలో అలంకరించి భక్తుల దర్శనార్ధం తిరువీధులలో ఊరేగింపు వేడుక నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ మహావిష్ణువు అలంకారం, గరుడ వాహన శేవ ప్రత్యేకత వైకుంఠవాసి శ్రీ మహావిష్ణువు శ్రియః పతి శ్రీమన్నారాయణుడు భక్త రక్షణార్ధం యోగ నిద్రలో జగత్తును రక్షణ గావించుట వేద ప్రసిద్ధమై ఉన్నది. శ్రీ మహావిష్ణువు అనంత కళ్యాణ గుణములను లెక్కింపనెవరికి సాధ్యపడదు. "విష్ణుం సదాహం శరణం ప్రపద్యే" అనే శరణాగతి దైవము శ్రీ మహా విష్ణువేనని సకల పురాణములు వేదములు పేర్కొనుచున్నవి. మహావిష్ణువు శబ్దమునకు అంతటా వ్యాపించి రక్షించువాడు అని అర్ధము. లోక కంఠకులైన దానవులను సంహరించుటలో శ్రీ మహా విష్ణువే అంతర్లీనముగా ఉండి అనుగ్రహించునని పురాణములు ఇతిహాసములు తెలియజేస్తున్నాయి.

**దివ్య విమాన రథోత్సవ వేడుకలు**

సాయంకాలం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరము చతుస్థానార్చనలు, మూలమంత్ర జపములు, మండపారాధనలు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాదులు నిర్వహించెదరు. అనంతరము దివ్య విమాన రథోత్సవ వేడుకలు శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా నిర్వహించబడును. రథాంగహోమము, రథబలి నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తుల అలంకార సేవ రథంపై వేంచేపు చేసి భక్తుల దర్శనార్ధము ఆలయ తిరువీధులలో అంగరంగ వైభవముగా ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

శ్రీ స్వామివారి దివ్య విమాన రథోత్సవం ప్రత్యేకత. ఈ వేడుకల్లో కార్యనిర్వహణాధికారి జె. భవానీశంకర్, ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ ఎమ్. హనుమంతరావు,ఇరిగేషన్ కమీషనర్ శివకుమార్ నాయుడు, ఉపకార్యనిర్వహణాధికారి, సహాయకార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

- **వామపక్షాల డిమాండ్**

**ముద్ర, ఖమ్మం :**



ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల ప్రాంతంలో ఇళ్లు కూల్చివేతలో నిర్వాసితులైన వారందరికీ వెంటనే పునరావాసం కల్పించాలని, ప్రత్యామ్నాయం నివాసం ఏర్పాటు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెలుగు మట్లలోని ఇళ్లను కూల్చడం తొందరపాటు చర్య అని యుద్ధ రంగాన్ని తలపించే రీతిలో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి భయోత్పాతం సృష్టించాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. గురువారం అంబేద్కర్ భవన్లో ఉన్న వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించారు. భూదాన్ భూమిలో ఆశ్రయం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న 600 కుటుంబాలకు సంబంధించిన రెండు వేల మంది జీవిస్తున్నారని వారందరికి ఎటువంటి హెచ్చరికలు లేకుండా బుల్ డోజర్లతో విరుచుకుపడి కూల్చివేశారని ఇది ఒక అమానుష ఘటన అని వామపక్షాల నేతలు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, శ్రావణ్, చింతల రమేష్, సిపిఎం నాయకులు మాచర్ల భారతి, వై. విక్రం, యర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల బాధితులకు ఆహారం పంపిణీ

**ముద్ర, ఖమ్మం:**



ఖమ్మం నగర శివారు వెలుగు మట్లలోని భూదాన్ బోర్డ్ భూమిలో ప్రభుత్వం తొలగించిన గుడిసెలు, నిరాశ్రాయులైన బాధితుల పరామర్శ కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఖమ్మం పర్యటనకు విచ్చేశారు. యువనేత కేటీఆర్ కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు.. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వెలుగుమట్ల లో నిరాశ్రయులైన బాధితులు తమ గుడిసెల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేటీఆర్ పర్యటనలో స్వల్ప ఆలస్యం అవ్వడంతో బాధితులంతా ఆకలి, దప్పికతో అలమటిస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అప్పటికప్పుడు సుమారు 600 మంది బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు భోజనాలు లేక అలమటిస్తున్న తరుణంలో ఘటనా స్థలిలో భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ రవిచంద్రకు ఋణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళాశాల జాతీయ సేవా పథకం విభాగం 1 ఆధ్వర్యంలో మండలంలోని తుక్కాపురం గ్రామంలో శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా 7వ రోజు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ జనగాం పాండు మాట్లాడుతూ.. ఈ వారం రోజులు నిర్వహించిన ఈ శీతాకాల ప్రత్యేక శిబిరం మా గ్రామాన్ని ఎన్నుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, గ్రామపంచాయతీ సెక్రటరీ లోకేష్, ప్రోగ్రాం అధికారి తోటకూరి రామకృష్ణ, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

**ద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన తంగెళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల గురువారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులు కావాలన్నా మంజూరుకి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్నికైన నూతన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గా వెంకారెడ్డి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో శేరిలింగంపల్లిలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న వెంకారెడ్డి బదిలీ పై ఇక్కడికి వచ్చారు.

## బాధ్యులను కఠినంగా శిక్షించాలి

**ముద్ర, మోత్కూరు:**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేర మల్లన్న జాతరలో కుల వివక్షతతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. గురువారం మోత్కూర్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కులం పేరుతో దాడిచేసి రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## శివకుమార్ కు డాక్టరేట్ పట్ల హర్షం

**మోత్కూర్ ముద్ర న్యూస్:**

మోత్కూర్ మండలం సదర్ షాపూర్ గ్రామంలోని తీగల యాదగిరి, ఎల్లమ్మ దంపతుల మూడో కుమారుడు శివకుమార్ కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శివకుమార్ ఉన్నత విద్యను అభ్యసించి తమ కుటుంబ పేదరికం తొలగించాలనే కసి, పట్టుదలతో చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ జియాలజి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. సైన్స్ కళాశాలలో జియాలజి డిపార్ట్మెంట్లో "జియాలజీ అండ్ జియో కెమిస్ట్రీ ఆఫ్ పొదిలి గ్రానైట్ , ప్రకాశం డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్ " అంశం పైన ప్రొఫెసర్ (ఏ మ్ డి) జి. నాగేంద్రబాబు, ప్రభాకర్ గారి పర్యవేక్షణలో పరిశోధనలు నిర్వహించి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ రేటును పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు అభినందించారు. తమ గ్రామంలో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి దళితుడు కావడం పట్ల పరుశరాములు (మాజీ వార్డ్ మెంబర్),మహేష్, విజయ్, భూపాల్, సురేష్, రాజా సింహం, నరేష్, తీగల శ్యామ్, నాని, చింటూ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

**లిహర్ గని**



(పాపువా న్యూ గినియా) సముద్ర ద్వీపంలో ఉన్న ప్రత్యేకమైన గని. జియోథర్మల్ కార్య కలాపాల మధ్యలో బంగా రం తవ్వకం జరుగుతుంది.

# జోగిపేటలో జర్నలిస్టుల సంబరాలు


**- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పదవీకాలం పొడిగింపై హర్షం**
**- స్వీట్లు పంపిణీ చేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు**



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:** జర్నలిస్టు రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పదవీకాలన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఆందోల్ నియోజకవర్గం కేంద్రమైన జోగిపేటలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టీయూడబ్ల్యూజే ఐజేయు) ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని జర్నలిస్టులు సంబరాలు జరిపారు. జర్నలిస్టులు టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అక్షరం అనే ఆయుధంతో నవ సమాజ నిర్మాణం కోసం పయనించడంతో పాటు జర్నలిస్టు నాయకుడిగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. జోడు పాత్రలకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇప్పటికే తన పదవి కాలంలో మీడియా రంగంలో పలు శిక్షణ కార్యక్రమాలు, వర్క్ షాపులు నిర్వహించడంలో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మీడియా అవగాహన కార్యక్రమాలు, మీడియా నైతిక విలువల పరిరక్షణ వంటి అంశాల్లో ఆకాడమీ చురుకుగా వ్యవహరించిందన్నారు. పదవీకాలం పొడిగింపుతో మీడియా రంగంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ముందుకు వెళ్లుతాయన్నారు. రాష్ట్రంలో మీడియా ప్రమాణాలను మెరుగుపరచడం, యువ జర్నలిస్టులకు అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాల సాధనకు తోడ్పడుతుందన్నారు. శ్రీనివాస్ రెడ్డి పదవీని మరో రెండేళ్లు పొడిగించినందుకు నియోజకవర్గం ప్రెస్ క్లబ్ పక్షాన సీఎం రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అ ధ్యక్షులు కనకంటి భూమయ్య, రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు ముని పల్లి యాదగిరి, జిల్లా కార్యదర్శి ఆనంద్ వర్ధన్, ఐజేయూ మాజీ సభ్యులు వెంకట్ రెడ్డి, ఆందోల్ నియోజకవర్గం లోని ఆయా మండలాల జర్నలిస్టులు రాజేందర్, ఆర్‌ఏ సత్యం, అశోక్, సుమన్, ధనంజయ్ , జైపాల్, రాజు, హజ్మత్, కృష్ణ, శేఖర్, హర్షద్, శంకర్, రాజ్ కుమార్, పల్లె గడ్డ రాజు, శ్రీశై లం, దాసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**- డీఈఓ శ్రీనివాస్ రెడ్డి**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు,పల్, స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక చొరవ తీసుకొని కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సైన్స్ సెమినార్లు, సైన్స్ పుస్తక ప్రదర్శన, పరికరాల ప్రదర్శన, ప్రయోగాలు, ప్రాజెక్టుల ప్రదర్శనను నిర్వహించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉండే శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు, విజ్ఞాన మేళాలను ఏర్పాటు చేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ 9849699382 నంబర్ కు సంప్రదించాలని కోరారు. సైన్స్ కార్యక్రమాలకు సంబంధించిన రెండు లేదా మూడు ఫోటోలను cnu kp 2014@gmail.comకు పంపాలని ఆదేశించారు.

## శివాజీ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

**ముద్ర, హైదరాబాద్:** శివాజీ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అంతర్గం పీఠాధిపతి కరణ్ మహరాజ్ సూచించారు. నిజామాబాద్ జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో గురువారం చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతర్గం పీఠాధిపతి కరణ్ మహరాజ్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చత్రపతి శివాజీ విగ్రహాన్ని కరణ్ గజేంద్ర భారతి మహరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ జీవితం, ఆయన చేసిన ధర్మపరమైన పోరాటాలు, ప్రజల స్వేచ్ఛ కోసం సాగించిన యుద్ధాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ధర్మం, న్యాయం, స్వాభిమానంతో పాలన చేసిన శివాజీ జీవితం ఆదర్శమన్నారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ శివాజీ చూపిన ధైర్యం, నాయకత్వం, అలవర్చుకోవాలని సూచించారు.

# గోటి తలంబ్రాలతో ఊరేగింపు



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కొండపాకలో గురువారం భద్రాచల రాములోరి కల్యాణానికి వినియోగించే గోటి తలంబ్రాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆధ్వర్యంలో భక్తులు రామ నామ స్మరణ చేసుకుంటూ భారీ ర్యాలీతో మార్కండేయ దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ రామకోటి రామరాజు భక్తులతో మూడు గంటల పాటు రామ నామ స్మరణ చేయిస్తూ గోటితో వడ్లను ఓలిచి తలంబ్రాలుగా మార్చారు. 108 కలశాలల్లో నింపి రామకోటి రామ రాజుకు అందజేశారు. ఈ సారి కల్యాణానికి మూడు క్వింటాళ్ల గోటి తలంబ్రాలు అందిస్తున్నామని రామకోటి రామరాజు తెలి పారు. భక్తులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ తాము భద్రాచలం వెళ్లలేక పోయినా తాము ఓలిచే తలంబ్రాలు భద్రాచల కల్యాణానికి వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలం అని తెలిపారు. మొదటిసారి తమ గ్రామానికి అవకాశం రావడం అనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం తమ గ్రామం నుంచి భద్రాచల రాముని కల్యాణానికి అందిస్తామని తెలిపారు. రామకోటి రామ రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు మంతెన నాగరాజు, ఆనంద్, భరత్ కుమా ర్, యాదగిరి, చంద్రమౌళి, వెంకటేశం, రఘు, నవీన్, గ్రామ ప్రతి నిధులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి

**- డీఏఓ శివ ప్రసాద్**




**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ ఫామ్ సాగు జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్ ఏఈఓలకు సూచించారు. కలెక్టరేట్ సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓ లతో ఆయిల్ ఫామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,750 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యం ఉందన్నారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ ఫామ్ సాగును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో 1,850 ఎకరాలలో సాగు చేశారని చెప్పారు. ఆయిల్ ఫామ్ సాగు లాభాలపై రైతులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించి , లక్ష్యానికి మించి అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

యూరియాకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్ణిత సమయంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వర్, గోద్రెజ్ సంస్థ జనరల్ మేనేజర్ స్వీటీ, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, ఏడిఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

**- 98.03 శాతం హాజరు**
**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 15,515 మంది విద్యార్థులకు గాను 15,209 మంది హాజరయ్యారన్నారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. అందులో జనరల్ కోర్సుకు చెందిన 259 మంది, వృత్తి కోర్సుకు చెందిన 47 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం హాజరు శాతం 98.03% నమోదైందన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11, హెచ్‌పీసీ సభ్యులు 5, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అన్ని సరీక్షలను సజావుగా జరిగే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ నూతన కలెక్టర్ గా ప్రతిమాసింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. ప్రతిమా సింగ్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేస్తుండగా కలెక్టర్ గా బదిలీపై వచ్చారు. గతంలో మెదక్ అదనపు కలెక్టర్ గా పనిచేసి వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షే మ పథకాలు ప్రజలకు చేరాలని తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డీఈఓ, ఇంటర్మీడియట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ భుజంగరావు, డీఆర్ డిఓ శ్రీనివాస్ రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రాహుల్ రాజ్ బదిలీ..**

మెదక్ కలెక్టర్ గా పనిచేసిన రాహుల్ రాజ్ బదిలీ అయ్యారు. సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ రాజ్ 2024 మార్చి 6న ఆదిలాబాద్ నుంచి మెదక్ కలెక్టర్ గా బదిలీపై వచ్చారు.

## రెండు పెట్రోల్ బంకులు మంజూరు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ శాఖకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు చెందిన రెండు పెట్రోల్ బంకులు మంజూరైనట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. వీటిని శంకరంపేట్ (ఆర్) మండల కేంద్రంలో, మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన ఆవుసులపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. గురువారం ఆవుసులపల్లిలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంపేట్ (ఆర్) మండల కేంద్రంలో మంజూరైన పెట్రోల్ బంకు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ రెండు పెట్రోల్ బంకులు పూర్తిగా పోలీస్ శాఖ ఆధీనంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీలు ప్రసన్న కుమార్, రంగనాథ్, సీఐలు జర్జ్, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ శైలందర్, రామకృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలి




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్ గ్రేడ్ చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గురువారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో మాదిరిగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి తెలుగు, హిందీ పండితుల వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ స్థాయి పోస్టులుగా ఉన్నతీకరించి, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేసి, రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రతి నెల ఒకటిన వేతనాలు చెల్లించాలని, విద్యాశాఖ మాదిరిగానే బదిలీలు పదోన్నతులు చేపట్టాలన్నారు.

రాష్ట్రంలోని అన్ని గిరిజన వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలన్నారు. అన్ని ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యాబలం, సెక్షన్ల ఆధారంగా పోస్టులను మంజూరు చేయాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో అప్పీల్లన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రత్యేక టిఆర్ టీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కామన్ సర్వీస్ రూల్స్ ను రూపొందించి ప్రమోషన్లకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, సిద్దిపేట అర్బన్, కొమురవెల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, రాంకిషన్, దశరథం, శివరాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** మిషన్ భగీరథ పరిధిలో గల సింగూరు ఆనకట్ట వద్ద వంద ఎంఎల్ డీ నీటి శుద్ధి కర్మాగారంలో ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులు చేపడుతుండటంతో రెండు రోజుల పాటు నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో మునిపల్లి, కోహిర్, ఝరాసంఘం , జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్ పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో శుక్రవారం, శనివారం నీటి సరఫరా కాదని పేర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తైన వెంటనే సాధారణ నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సౌత్ డీప్ గని (దక్షిణాఫ్రికా)**

ప్రపంచంలోనే అత్యంత లోతైన గోల్డ్ మైన్స్‌లో ఒకటి. భూమికి 3 కిలోమీటర్ల లోతులో తవ్వకం జరుగుతుంది.



# భూదాన్ భూముల్లో రియల్ బూమ్

- రగిలిన ఖమ్మం
- అసలు కూల్చివేతల వివాదం ఏమిటి..?
- నిజంగానే బాధితులా.. ?
- భూదాన భూములంటున్న ప్రభుత్వం
- మండిపడుతున్న విపక్షాలు
- సామాన్యుడి ఆశ చంపేస్తున్నారా..?

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కాంగ్రెస్ కు కంచుకోటగా.. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తమకు పట్టున్న జిల్లా ఖమ్మం అనే చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖమ్మం రగులుతోంది. డిప్యూటీ సీఎం.. ఇంకో కీలక మంత్రి.. మరో సీనియర్ మంత్రి ఉన్న ఈ జిల్లా ఇప్పుడు అదుపులోకి రావడం లేదు. ఖమ్మం నగరాన్ని ఆనుకుని ఉన్న వెలుగుమట్ల భూదాన్ భూముల్లో నిర్మించుకున్న సుమారు 650 ఇళ్లను రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా జేసీబీలతో గూడును నేలమట్టం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ పనులు చేసుకుంటూ, అప్పులు చేసి కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఒక్కో ఇటుక పేర్చుకుని నిర్మించుకున్న ఇళ్లు కళ్ల ముందే ధ్వంసమవుతుంటే మహిళలు, వృద్ధులు అడ్డంగా పడుతూ రోదించిన తీరు అక్కడి వారిని కలిచివేసింది.

**భూదాన్ బోర్డుకు చెందిన భూములు..**

ఈ భూములు భూదాన్ బోర్డుకు చెందినవని, ఇవి ప్రభుత్వ పరిధిలోకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎనిమిది నెలలుగా పేదలు ఈ భూమిలో గుడిసెలు వేసుకుని, క్రమంగా రేకుల ఇళ్లు, పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ కొన్ని కోట్ల రూపాయలు ఉంటుందని సమాచారం. గతంలోనే అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, ఇళ్ల నిర్మాణాలు ఆగకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఈ తొలగింపు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

**కోర్టు ఆదేశాలు అంటున్న అధికారులు - విపక్షాల ఆగ్రహం**

ఈ ఘటనపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా వంటి పార్టీల నేతలు బాధితులకు మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. పేదల ఇళ్లను కూల్చడం అమానుషమని, వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో తాము పేదలకు అండగా ఉన్నామని, ఇప్పుడు అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు.

**కోర్టు ఆదేశాల వల్లేనంటున్న కాంగ్రెస్ నేతలు..**

అధికార కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. ఇవి భూదాన్ భూములు కావడం వల్ల చట్టపరమైన చిక్కులు ఉన్నాయని, ప్రభుత్వ భూములను ఆక్రమించడం సరైనది కాదని కొందరు నేతలు వివరిస్తున్నారు. అయితే, నిజమైన పేదలకు అన్యాయం జరగకుండా చూస్తామని, అర్హులైన వారికి ప్రభుత్వం తరపున ఇళ్ల పట్టాలు లేదా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని స్థానిక కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ఆక్రమణలు మొదలయ్యాయని, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. మొత్తంగా ఖమ్మంలో ఇళ్ల కూల్చివేత వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధితులు తమ సామాన్లతో శిథిలాల మధ్యే వర్షంలో కాలం గడుపుతున్నారు. పిల్లల చదువుల కారణంగా తమను కరుణించాలని, తమకు గూడు కల్పించాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని, రాజకీయాల కంటే పేదల బతుకులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తులు వ్యక్తమవుతున్నాయి.



**సామాన్యుడి ఆశను రియల్ భూమ్ చంపేస్తోందా?**

కొందరిది మహోన్నత ఆశయం, మరికొందరిది జీవిత కల, ఇంకొందరిది వ్యాపార బుద్ధి, ఇలా రకరకాల ఆలోచనలో ఖమ్మం రగిలిపోతోంది. ఇందులో రాజకీయం జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదురుతోంది.

కొన్ని రోజులుగా ఖమ్మం శివారు వెలుగుమట్లలోని వినోభా నవోదయ కాలనీ వార్తల్లో మార్మోగుతోంది. పదిహేను సంవత్సరాలకుపైగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు, గుడిసెలను ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించి రాత్రికి రాత్రే ఖాళీ చేయించడం సంచలనంగా మారుతోంది. అడ్డుకునేందుకు బాధితులు చేసిన నిరసన సైతం ఎలాంటి ప్రయోజనం ఇవ్వలేదు. ఈ చర్యపై అన్ని వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడా బాధితులకు తాము అండగా ఉన్నామని ప్రతిపక్షాలు ముందుకొస్తున్నాయి. గురువారం బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా బాధితుల పరామర్శకు వెళారు.

**వినోబా భావే ఆశయంతో మొదలై... రియల్ భూమికి బలై!**

దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే దేశవ్యాప్తంగా చేపట్టిన భూదాన్ ఉద్యమంతో స్ఫూర్తి పొందిన కొందరు దాతలు వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సుమారు 31 నుంచి 60 ఎకరాల తమ భూమిని పేదలకు పంపిణీ చేయమని ప్రభుత్వానికి ఇచ్చారు. భూమి లేని నిరుపేదలకు గూడు దొరుకుతుందన్నది వారి ఆశయం. అయితే భూదాన్ బోర్డు పేరుతో స్థలం ఉన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ ఈ స్థలంలో పట్టాలు కేటాయించలేదు. కాలక్రమేణా ఖమ్మం పట్టణం విస్తరించడం, నగరంలో కొత్త కలెక్టరేట్ కూడా ఈ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే నిర్మాణమవడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏళ్ల క్రితం 'దానం'గా వచ్చిన భూమి ఇప్పుడు కోట్ల రూపాయల 'బిజినెస్'గా మారిపోయింది.

**ఇప్పుడు పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంటోందా..**

ఎన్నికలకు ముందు అన్ని పార్టీల వాళ్లూ తమకు పట్టాలిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు కానీ జిల్లా నుంచే మంత్రులైన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు మొహం చాటేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ భూమిని కాపాడుతున్నామని కాంగ్రెస్ చెబుతోంది. భూమాఫియా నుంచి భూదాన్ భూములను విడిపించడమే లక్ష్యంగా పేర్కొంటున్నారు. తమ హయాంలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించగా, రేవంత్ సర్కారు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని బీఆర్ ఎస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి. కారణాలేమైనా దశాబ్దాలుగా అక్కడ బతుకుతున్న పేదల జీవితాలు ఒక్క రోజులో రోడ్డున పడ్డాయి. ఉన్నట్టుండి నివాసాలు కూల్చేసి తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లలో వసతి కల్పించిన ప్రభుత్వం వారికి శాశ్వత ప్రత్యామ్నాయం మాత్రం చూపలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. నేటి రియల్ ఎస్టేట్ భూమ్‌లో పెరుగుతున్న భూముల ధరలకూ, సొంత గూడు కలకు మధ్య నలుగుతున్న పేదవాడికి పరిష్కారం చూపకపోతే ఈ వేడి ఖమ్మం నగరాన్ని మరింత రగిలించే అవకాశం కనిపిస్తోంది.

**వివాదం ఎక్కడ మొదలైంది? ఇప్పుడెందుకు రగులుతోంది?**

పదేళ్లకుపైగా 'వినోబా నవోదయ కాలనీ'పేరుతో సుమారు 600 నుంచి 1,000 కుటుంబాలు అక్కడ గుడిసెలు, రేకుల ఇళ్లు వేసుకుని నివసిస్తున్నాయి. వీరికి మున్సిపల్ అధికారులు నల్లా కనెక్షన్లు ఇచ్చారు, విద్యుత్ శాఖ మీటర్లు బిగించారు. అంతేకాదు, గత ఎన్నికల సందర్భంగా ఇక్కడ ఓట్లు కోరిన రాజకీయ నాయకులు వారికి పట్టాలు ఇస్తామనే హామీలు కూడా ఇచ్చారు. కానీ భూదాన్ బోర్డు నుంచి ఈ భూమి ఎవరికీ అధికారికంగా కేటాయించలేదనీ, కొందరు దళారులు నకిలీ పత్రాలతో ఇక్కడ పేదలను చేర్పించి లక్షల రూపాయలు వసూలు చేశారని ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల వాదన. ప్రస్తుత ఉద్రిక్తతలకు రెండు ప్రధాన కారణాలు.. భూదాన్ బోర్డు ఆస్తులను రక్షించడంలో విఫలమైతే అధికారులదే బాధ్యత అని హైకోర్టు ఘాటుగా స్పందించింది. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి స్థలం స్వాధీనం చేసుకోవాలనే చర్యలు చేపట్టింది. ఇది ఒకవైపు నుంచి వినిపిస్తున్న వాదన. ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరగడంతో, ఇక్కడి భూమి విలువ ఎకరాకు ₹10 కోట్లకుపైగా పెరిగింది. మొత్తం భూమి విలువ సుమారు రూ 250 నుంచి 300 కోట్లు కావడంతో అధికార యంత్రాంగం దీనిపై కన్నేసిందన్న విమర్శ రెండోది. ఈ వాదనలు ఇలా సాగుతున్న టైంలోనే ఈనెల 24న పెద్ద ఎత్తున ఆక్రమణల కూల్చివేత కార్యక్రమం జరిగింది. మూడు జిల్లాల నుంచి సుమారు 1,000 మందికి పైగా పోలీసుల పహారాలో, ఎస్.డి.ఆర్.ఎఫ్ (SDRF) బృందాల సమక్షంలో డజన్ల కొద్దీ జెసిబిలతో ఇళ్లను నేలమట్టం చేశారు. మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినా యంత్రాంగం వెనకడుగు వేయలేదు. "మా ఓట్లు తీసుకునేటప్పుడు ఈ భూమి ప్రభుత్వానిదని తెలీదా?" అని బాధితులు ప్రశ్నించారు.

---

### గ్రామ స్థాయిలో

# చూసుకుందాం..

- సీఎం రేవంత్ నయా ప్లాన్
- 99 రోజుల యాక్షన్
- డిప్యూటీ సీఎం నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత గ్రామ స్థాయిలో ప్లాన్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డి కొత్త యాక్షన్ ప్లాన్ కు శ్రీకారం చుట్టారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్ర స్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది.

**వచ్చే మూడు నెలలు యంత్రాంగం అంతా ప్రజల్లోనే ..**

ప్రభుత్వ వ్యూహం ప్రకారం రాబోయే మూడు నెలల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది.

**గ్రామ స్థాయిలో పెండింగ్ పనులు పూర్తి చేసేలా సన్నాహాలు..**

ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.

---



# గాడితప్పిన రెవెన్యూ వ్యవస్థ

- భూభారతి పేరుతో.. కాంగ్రెస్ మార్క్ అవినీతి
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. గురువారం సిద్ధిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయం వద్ద తమ పనుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతిని ఎండగట్టారు. భూభారతి తీసుకొచ్చాక ఏప్రిల్ నెలలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెడితే రాష్ట్ర వ్యాప్తంగా 8,68,000 అప్లికేషన్లు వచ్చాయన్నారు. పది నెలలు గడుస్తున్నా ఆ దరఖాస్తులు ఏమయ్యాయో, అసలు ఆన్‌లైన్ చేశారో లేదో ప్రభుత్వానికే తెలియదని ఆరోపించారు. ఆ అప్లికేషన్లను చెత్తబుట్టలో వేశారా.. లేక పాత కాగితాల కింద అమ్ముకున్నారా అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేసుకుంటే, మ్యుటేషన్‌తో సహా కేవలం వారం రోజుల్లో పాస్ బుక్ నేరుగా రైతు ఇంటికి వచ్చేదన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండేది కాదన్నారు. కానీ ఇప్పుడు భూభారతి వచ్చాక రిజిస్ట్రేషన్ సమయంలో పాస్ బుక్ ఫీజు కింద 300 రూపాయలు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఆరు నెలలు అవుతున్నా పాస్ బుక్కులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 6,20,000 మంది రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సాదా బైనామాలు చేసి పాస్ బుక్ లు ఇచ్చామన్నారు. రెండో విడత కింద 9,26,000 అప్లికేషన్లు వస్తే, ఆనాడు కోర్టు స్టే వల్ల ఆగిపోయాయని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చాక స్టే వెకేట్ అయినా.. కావాలనే సాదా బైనామాను అమలు చేయడం లేదన్నారు. సాదా బైనామా అమలు కావడం లేదన్నారు. గతంలో పది శాతం ఉన్న నిషేధిత భూముల సంఖ్య ఇప్పుడు కోటి ఎకరాలు దాటిందన్నారు. హైకోర్టు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా, ఈ జాబితాను పబ్లిక్ డొమైన్ లో ఎందుకు పెట్టడం లేదన్నారు.

ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయి ప్రజల దగ్గర డబ్బులు లేకపోయినా కనికరం లేకుండా గోసపెడుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు చెల్లించి, స్లాట్ క్యాన్సిల్ చేసుకున్న వారికి డబ్బులు తిరిగి ఇవ్వకుండా రెండున్నరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై అసెంబ్లీలో రెవెన్యూ మంత్రిని నిలదీస్తే వెంటనే చెల్లిస్తామని చెప్పారని, కానీ ఇంత వరకు రూపాయి ఇవ్వలేదన్నారు. రెవెన్యూ శాఖలో విపరీతమైన అవినీతి జరుగుతోందని ఆందోళన వ్యక్త చేశారు. మంత్రి కుమారుడే భూ కబ్జాలకు పాల్పడుతుంటే, అతనిపై కేసులు పెట్టాల్సింది పోయి.. ఆ భూమిని కాపాడిన సీఐని బదిలీ చేశారన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వడానికి కూడా ప్రజలను నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని చెప్పారు. తక్షణమే ముఖ్యమంత్రి రెవెన్యూ శాఖపై సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల పక్షాన ఈ అంశాలన్నింటినీ లేవనెత్తుతామని ఆయన స్పష్టం చేశారు.

---

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్

- ప్రభుత్వ ప్రగతిని చూడలేని కేసీఆర్ కుటుంబం విష ప్రచారం
- వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బాధితులకు ఇంటి స్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది
- వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ది చెబుతున్నా మారని బీఆర్ఎస్ వైఖరి
- కాళేశ్వరం ప్రాజెక్ట్ లో బీఆర్ఎస్ అవినీతికి బీజేపీ సహకారం
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలుచ సూచనలు ఇవ్వాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్ అని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వీరికి బిజేపీ నేతలు వంతపాడుతున్నారని ఆరోపించారు. గురువారం సచివాలయంలో ఎంపీ బలరాం నాయిక్, రామసహాయం రఘురామరెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముందుగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని ఆరోపించారు. అక్కడ పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిందన్నారు. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించిందని చెప్పారు. అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో నిజంగా పేదలపై ప్రేమ ఉంటే ఫాంహౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత వెచ్చించి ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను చేపట్టి ఎనిమిదో వింతగా ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు. వారి హయాంలోనే రూ. లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడంతో పాటు అవినీతి కారణంగా బీటలు వారిందన్నారు. నాలుగేళ్లలో 168 టిఎంసీ నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసీల నీటిని సముద్రం పాలుచేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బీఆర్ఎస్ కు ఏటీఎం గా మారిందన్న బిజేపీ నేతలు.. అదే పార్టీతో చేతులు కలిపారని ఆరోపించారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్ట్ లను తమ ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. వచ్చే నెల 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలని సూచించారు. గతంలో ప్రతి పక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేని బీఆర్ఎస్ కు తాము కచ్చితంగా అవకాశం ఇస్తామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందని మండిపడ్డారు. 196 టిఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టీఎంసీలకు పరిమితం చేసిందన్నారు. దీంతో 50 టీఎంసీలు సముద్రంలో కలిపిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడితే తాము అధికారంలో వచ్చాక శ్వేత పత్రం జారీ చేశామన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చించడంతో పాటు కేంద్రం చర్యలు కోరామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 48వేల కోట్లు మిత్తీగా కట్టిందన్నారు. కేంద్రప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలని కోరారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారిందన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు , ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బీఆర్ఎస్ అనుకూల నీటి ప్రాజెక్టులను చేపట్టిందని మండిపడ్డారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



పూ్యబ్లో వియెహో గని (డొమినికన్ రిపబ్లిక్)

లాటిన్ అమెరికాలో ప్రముఖ గోల్డ్ మైన్.
Barrick Gold మరియు Newmont సంయుక్తంగా నిర్వహిస్తున్నారు



## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వెబ్‌సైట్ ప్రారంభం

**ముద్ర, కూకట్‌పల్లి :**

వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సమాచారం భక్తులకు ఇకపై డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంటుంది. ఆలయ ప్రధాన అర్చకులు కోసూరి రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో, పాలక మండలి మరియు భక్తుల సహకారంతో రూపొందించిన నూతన వెబ్‌సైట్‌ను కాలనీ గౌరవ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఆలయ వివరాలను డిజిటలైజ్ చేయడం అభినందనీయమన్నారు. భక్తులు నిత్యకైంకర్యాలు, ప్రత్యేక సేవల సమయాలు, వార్షిక బ్రహ్మోత్సవాలు, పండుగల తేదీలు వంటి సమాచారాన్ని ఇంటి నుండే తెలుసుకోవచ్చని, సేవలను బుక్ చేసుకోవచ్చని, ఆలయ అభివృద్ధికి విరాళాలు సురక్షితంగా ఆన్‌లైన్‌లో అందించవచ్చని తెలిపారు. దేశవిదేశాల్లో ఉన్న భక్తులు కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా స్వామివారి కార్యక్రమాలను వీక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని వినియోగించి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన 'ఉద్యమి' సభ్యత్వ నమోదు ప్రారంభం

**ముద్ర, కూకట్‌పల్లి :**

మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ సమీపంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనసేన సైబరాబాద్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన "జనసేన ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, పారదర్శక పాలన, యువతకు ప్రాధాన్యత, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని పటిష్టం చేయడమే 'ఉద్యమి' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే కార్యకర్తలు, నాయకులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సాధకులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని జనసేన నాయకులు, పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలక మలుపు అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## క్రీడాకారులకు సీపీ అభినందనలు

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ సిబ్బంది 4వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2026 లో ప్రతిభ కనబరిచి మొత్తం పతకాల పట్టికలో ద్వితీయ స్థానం సాధించారు. ఫిబ్రవరి 16 నుండి 21 వరకు సైబరాబాద్ లో నిర్వహించిన ఈ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు జిమ్నాస్టిక్స్, యోగా, వాటర్ స్పోర్ట్స్, తైక్వాండో, వుషు, అథ్లెటిక్స్, ఆర్మ్ రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పెంచాక్ సిలాట్, ఆర్చరీ, కబడ్డీ, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ తదితర విభాగాల్లో పాల్గొని మొత్తం 81 పతకాలు (బంగారం, వెండి, కాంస్యం) సాధించారు. మొత్తం పతకాల పట్టికలో రెండో స్థానంతోపాటు మహిళల విభాగంలో ఆల్‌రౌండర్ రన్నర్‌గా నిలిచారు.

**విశేష వ్యక్తిగత ప్రతిభ...**

ఏఆర్‌పీసీ సంజీవ్ వివిధ విభాగాల్లో 8 పతకాలు సాధించారు. ఏఆర్‌పీసీ యమన్ ఆర్చరీలో 4 బంగారు పతకాలు గెలుచుకున్నారు. డబ్ల్యూపీసీ నందిని జిమ్నాస్టిక్స్‌లో 5 పతకాలు సాధించారు. జట్టు విభాగాల్లో విజయాలు ఇలా ఉన్నాయి. మహిళల టగ్ ఆఫ్ వార్ జట్టు బంగారు పతకం, పురుషుల ఫుట్‌బాల్ జట్టు వెండి పతకం, మహిళల కబడ్డీ జట్టు వెండి పతకం, పురుషుల కబడ్డీ జట్టు కాంస్య పతకం సాధించారు. ఈ విజయాలను పురస్కరించుకుని సీపీ క్రీడాకారులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి నగదు బహుమతులను ప్రకటించారు.

## నాగసమందర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ నుండి కోట్ పల్లి వెళ్ళే మార్గంలోని నాగసమందర్ వద్ద కోట్ పల్లి వాగుపై నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 27.50 కోట్ల రూపాయలను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ మంజూరు చేశారు. వర్షాకాలంలో ప్రస్తుతం ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై పై నుంచి నీళ్ళు పారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలు ఆగిపోతున్నాయి. పరిస్థితిని గమనించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి శాశ్వత పరిష్కారంగా రూ. 27.50 కోట్లతో నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారు. ఈ నూతన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులను మంజూరు చేయించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ధారూర్, కోట్ పల్లి మండలాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



# పాలమూరులో రెండు ముక్కలైన కాంగ్రెస్

- **కార్పొరేషన్ ఎన్నికల తరువాత బయటపడిన అంతర్గత విభేదాలు**
- **మేయర్ ఎంపికలో రెండు వర్గాలుగా మారిన నేతలు...**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్ నగర్ కార్పొరేషన్ ఎన్నికల తరువాత మేయర్ ఎంపిక సమయంలో కాంగ్రెస్ లో రాజకీయ రణరంగమే జరిగింది. కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించి తాను అనుకున్న వారికే మేయర్ పదవి కట్టబెట్టి పంతం నెగ్గించుకున్నారు ఇక్కడి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. అనంతరం రాజకీయ అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. మేయర్ ఎంపిక తరువాత పాలమూరు కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోయింది. ఇంతకాలం ఒక్కటిగా ఉన్న కాంగ్రెస్ లో గ్రూప్ రాజకీయాలకు తెరలేపారు. కొందరు సీనియర్ నేతలు. మేయర్ ఎంపిక సమయంలో జరిగిన రసవత్తర రాజకీయం ప్రస్తుతం పాలమూరులో హాట్ టాపిక్ అయింది. మేయర్ ఎంపిక ముందు జరిగిన రాజకీయం ఇప్పుడే ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమి చెందిన కొందరు నేతలు సొంత పార్టీ నేతలే తమ ఓటమికి కారణమని బాహటంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. 37 వార్డులో కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్పి వెంకటేష్ కూతురు నేహాశ్రీ కాంగ్రెస్ నుంచి కార్పొరేటర్ గా పోటీలో ఉన్నారు. ఈమె ఇక్కడ విజయం సాధిస్తే మేయర్ పదవి దక్కుతుందనేది కాంగ్రెస్ పార్టీలో టాక్ వచ్చింది. అలాగే 41 డివిజన్ లో కార్పొరేటర్ గా పోటీ చేసిన ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ భార్య స్వప్న కూడా మేయర్ పదవికి పోటీలో ఉన్నారు. వీరిద్దరిలో ఎవరు గెలుపొందినా మేయర్ పీఠం దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ లో ప్రతి ఒక్కరూ అనుకున్నారు. 40 డివిజన్ లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ భార్య ప్రసన్న కార్పొరేటర్ గా కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. ఈమె గెలిస్తే కూడా మేయర్ అయ్యే అవకాశం లేకపోలేదు. ఇక్కడే కాంగ్రెస్ మార్క్ రాజకీయం కనపడింది.




37 డివిజన్లో కాంగ్రెస్ అభ్యర్థి నేహాశ్రీ, 41 డివిజన్లో కాంగ్రెస్ అభ్యర్థి స్వప్న ఓటమి చెందారు. కానీ 49 డివిజన్ లో పోటీ చేసిన ప్రసన్న గెలుపొందింది. ఇక్కడే రాజకీయం రసవత్తర మలుపు తిరిగింది. నేహాశ్రీ, స్వప్న ఓటమి కి కారణం ఆనంద్ గౌడ్ అని ఎన్పీ వెంకటేష్, లక్ష్మణ్ యాదవ్ బహిరంగంగా ఆరోపణలు చేశారు. నేహాశ్రీ, స్వప్న గెలిస్తే వారిద్దరిలో ఒకరికి మేయర్ పీఠం దక్కుతుందనే భావనలో ఆనంద్ గౌడ్ వారిద్దరి ఓటమి కుట్ర చేశారని వారు అంటున్నారు. వీరిద్దరి ఓటమి తో ఆనంద్ గౌడ్ భార్య ప్రసన్న కు మేయర్ పదవి ఖాయమని అందరూ అనుకున్నారు. కార్పొరేటర్లు శంషాబాద్ లోని రిసార్ట్ లో ఉంటే తమకే మేయర్ విషయం లో మద్దతు పలకాలని ఆనంద్ గౌడ్ వారికి డబ్బులు ఇచ్చేందుకు సిద్ధం కాగా కొందరు నేతలు అడ్డుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆనంద్ గౌడ్ భార్య కు మేయర్ పదవి ఇవ్వాలని జిల్లా నేతలకు సూచించారు. అధిష్టానంతోపాటు డీసీసీ ప్రస్తుత అధ్యక్షులు, పాలమూరు మాజీ డీసీసీ అధ్యక్షులు , మార్కెట్ కమిటీ చైర్మన్ కూడా ప్రసన్న కే మేయర్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ డబ్బులు పెద్ద మొత్తం లో మారాయనేది ప్రస్తుతం పాలమూరు లో బర్నింగ్ ఇష్యూ. మేయర్ పదవి ప్రసన్నకు ఇవ్వవద్దని ఇతర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఓటమికి కృషి చేసిన ఆనంద్ గౌడ్ భార్య ప్రసన్న కు మేయర్ పదవి ఎలా ఇస్తామని ఎమ్మెల్యే యెన్నం అధిష్టానం తో విబేధించారు. అధిష్టానం, కొందరు కాంగ్రెస్ నేతలు ఆనంద్ గౌడ్ భార్యకే మేయర్ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ఎమ్మెల్యే యెన్నం అధిష్టానం తీరుపై మండిపడ్డారు. అధిష్టానం ఎమ్మెల్యే పై ఎంత ఒత్తిడి తెచ్చినా ఆయన వారి ఒత్తిడి కి తలొగ్గకుండా ఎట్టి పరిస్థితి లో ప్రసన్నకు మేయర్ ఇచ్చేది లేదని, ఇది జరగకుంటే తాను ఎమ్మెల్యే పదవి వదులుకుంటానని కాంగ్రెస్ అధిష్టానంకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఈ సమస్య ఎక్కడికో వెళుతుందని అధిష్టానం భావించి మౌనం వహించిందని సమాచారం. ఎమ్మెల్యే మరో అడుగు ముందుకేసి శంషాబాద్ లోని రిసార్ట్ లో ఆనంద్ గౌడ్ ను పోలీసుల అదుపులో ఉంచారు. మేయర్ ఎన్నిక సమయంలో గొడవ చేస్తారనే ముందస్తు సమాచారం మేరకు ఆనంద్ గౌడ్ ను పోలీసులు కట్టడి చేశారు. దీంతో ఆనంద్ గౌడ్ కొంత బయపడి వెనక్కు తగ్గారు. ఇక ఇక్కడి నుంచే ఎమ్మెల్యే పావులు కదిపారు. తన ఆలోచన మేరకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ లకు మేయర్ పదవి ఇచ్చారు. తొలి మేయర్ పదవి ముదిరాజ్ ఆడబిడ్డకు దక్కడం తో ఎమ్మెల్యే కు ఆ వర్గం నుంచి కొండంత మద్దతు వచ్చింది. ఎమ్మెల్యే పంతం నెగ్గించుకోవడం ఒక వంతైతే ముదిరాజ్ వర్గం లో సముచిత స్థానం లభించింది. ఇదేకాక డిప్యూటీ మేయర్ ఎంపిక లో కూడా ఒక రణరంగమే జరిగింది. పాలమూరు మాజీ డీసీసీ అధ్యక్షులు తన కుమారుడి కి మైనార్టీ కోటాలో డిప్యూటీ మేయర్ ఇవ్వాలని పట్టుబట్టారు. 60 డివిజన్ లో విజయం సాధించడం, ముగ్గురు ఎంఐఎం సభ్యులు కూడా తమకే మద్దతు గా ఉన్నారని ఆయన ఓ వైపు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు. ఈయన కూడా ఆనంద్ గౌడ్ కు మద్దతు గా ఉంటూ పలువురు కాంగ్రెస్ అభ్యర్థులను ఓటమి కి గురిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే వర్గం నేతలు ఈయనపై పార్టీ వ్యతిరేక ముద్ర వేశారు. దీంతో ఎమ్మెల్యే ఇవేమి పట్టించుకోకుండా పార్టీ కోసం కష్టపడిన 11 డివిజన్లో కార్పొరేటర్ గెలుపొందిన మారెపల్లి సురేందర్ రెడ్డికి డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చారు. ఈ రెండు ఎంపిక లో ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆనంద్ గౌడ్ కు మద్దతు ఇచ్చిన నేతలు ఆరోపణలు చేశారు. ఇవేమి పట్టించుకోకుండా ఎమ్మెల్యే తన పని తాను చేసుకుంటూ ప్రజల మన్ననలు పొందారు. ఈ ఎన్నికలతో ఎమ్మెల్యే వర్గం ఒక వైపు, డీసీసీ అధ్యక్షులు, పాలమూరుకు చెందిన మాజీ డీసీసీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మరో వైపు ఉన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు వీరంతా ఒకే వర్గంగా ఉన్న వీరు ప్రస్తుతం చెరో దారి లో ఉన్నారు. ఎన్నికల తరువాత వీరంతా ఎమ్మెల్యే కు దూరంగా ఉంటున్నారు. సీనియర్ నేతలై ఉండి పార్టీ కోసం పని చేయకుండా ఓ వ్యక్తి కోసం పనిచేసారనే అపవాదు మూటగట్టుకున్నారు. ప్రస్తుతం పాలమూరు ఈ అంశాలన్నీ తెరపైకి రావడం తో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత చర్చ మొదలైంది.

# తెలంగాణ ప్రజలు అవమానాన్ని భరించరు

- **అమరవీరుల స్ఫూర్తితో మీరందరూ విధులు నిర్వర్తించాలి**
- **నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి**
- **టీజీపీఎస్‌సీని ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం**
- **కొందరు ఉద్యోగాలను అమ్ముకున్నామని మాపై తప్పుడు ప్రచారం చేశారు**
- **వారికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు**
- **మీ ఉద్యోగాల కోసం ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడింది**
- **తల్లిదండ్రులను పట్టించుకోకపోతే జీతంలో కోత**
- **త్వరలో అసెంబ్లీలో చర్చించి చట్టం తీసుకువస్తాం**
- **గ్రూప్–1,2 అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ.. అవమానాన్ని భరించరని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాకతీయులపై వీరోచితంగా పోరాడినా సమ్మక్క సారలమ్మలు దేవతలు అయ్యారన్న ఆయన నిరంకుశ నిజాంపై తిరుగుబాటు చేసిన చరిత్ర తెలంగాణ నేలకుందని చెప్పారు. ఇక సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సమాన అవకాశాల కోసం వారు అమరవీరులు అయ్యారన్నారు. అలాంటి వీరుల స్ఫూర్తితో నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని గ్రూప్ 1, 2 ఉద్యోగులకు సీఎం పిలుపునిచ్చారు. 6 లక్షల మంది పోటీపడితే 582 మంది గ్రూప్ 1,775 మంది గ్రూప్ 2 ఉద్యోగాలు సాధించారని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీజీపీఎస్‌సీని ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా టీ జీ పీ ఎస్ సీ ని ప్రక్షాళన చేశామన్నారు. అందులో గ్రూప్ పరీక్షలపై అవగాహన ఉన్న వాళ్లను చైర్మన్ గా, సభ్యులుగా నియమించామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో లాగా ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్మకుండా అత్యంత కఠినంగా పరీక్షలు నిర్వహించామన్నారు. తాము ఇంత పక్కాగా ఉన్నా.. కొందరు ఉద్యోగాలను అమ్ముకున్నామని తమపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. అలాంటి వారికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క గ్రూపు 1 ఉద్యోగం అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం 15 ళ్ల పాటు గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆరోపించారు. కానీ ప్రజా ప్రభుత్వం గ్రూప్ 1 నిర్వహించి ఆకాంక్షలను నెరవేర్చిందని చెప్పారు. గ్రూప్ 1 నికి ఎంపికైన ఆనందం 24 గంటలు లేకుండా గిట్టని వాళ్లు కొందరు కోర్ట్ కు వెళ్లారని సీఎం ఆరోపించారు. అభ్యర్థులు ఒక్క తప్పు చేయలేదు.. మెరిట్ మీద ఎంపిక అయ్యారని ప్రభుత్వం భావించి సుప్రీం కోర్టు వరకు వెళ్లి కొట్లాడిందని వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న అధికారులు అందరూ ఉద్యోగంలో నిబద్ధత కనబర్చి... నాలుగు కోట్ల ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఎలాంటి అప్రోచ్‌తో ఉద్యోగంలో చేరారో రిటైర్మెంట్ వరకూ అలాగే ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు రకాల పరిస్థితులు ఎదురవుతాయి. గరం...నరం.. బేషరం.. మీరంతా మొదటి పరిస్థితి దగ్గరే ఆగిపోతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గరం, నరం, బేషరం అనే నానుడి తప్పు అని మీరంతా ప్రూవ్ చేయాలని చెప్పారు.

**తల్లిదండ్రులను పట్టించుకోకపోతే జీతంలో కోత**

పేదవారికి సాయం చేసే ముందు తల్లితండ్రులను గుర్తు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు. తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల జీతంలో 10 నుండి 15 శాతం కోత పెట్టేలా అసెంబ్లీ లో చట్టం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ విషయంపై త్వరలోనే హార్వర్డ్ యూనివర్సిటీ, ఎంసీహెచ్‌ఆర్ డీ మధ్య ఒప్పందం జరగబోతోందని సీఎం చెప్పారు. చట్టం గురించి హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన పలువురు వచ్చి ఎంసీహెచ్ఆర్డి లో ఉద్యోగులకు శిక్షణ ఇస్తారన్నారు.



## వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారి

- **అదనపు కలెక్టర్ గా ఉమా శంకర్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్ నారాయణ పేట్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లాలోని తాండూర్ సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఉమా శంకర్ ను వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## రంజాన్ కానుకలు అందేలా చర్యలు

**ముద్ర, మల్కాజిగిరి :**

ముస్లిం సోదరులకు ప్రతియేటా అందజేసే రంజాన్ కానుకలు గౌతమ్ నగర్ డివిజన్‌లో అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇందిరా నెహ్రూ నగర్‌కు చెందిన అబుబకర్ మసీదు, మిర్జాలగూడలోని కుతుబ్ షాహి మజీదు ముస్లిం పెద్దలు గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారి విన్నపంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్యాడియా వ్యాలీ గని (ఆస్ట్రేలియా)



గోల్డ్, కాపర్ మిశ్రమ గని.అండర్‌గ్రౌండ్ మరియు ఓపెన్ పిట్ మైనింగ్ రెండూ జరుగుతాయి.

# ఆర్డర్ కాదు...ఆపద్బాంధవులు కావాలి!

## టీమిండియాకు ఇప్పుడు అదే అత్యవసరం



**ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా చెన్నై వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ప్రభావవంతమైన ఆరంభం అందించాడు. 15 బంతుల్లో 24 పరుగులు చేసినప్పటికీ, గత మ్యాచ్‌ల్లో ఎదురైన డకౌట్ల సమస్యకు ముగింపు పలికాడు.**

ప్రత్యర్థులు ఎడమచేతి బ్యాటర్లపై ఆఫ్ స్పిన్నర్లతో ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో, మేనేజ్‌మెంట్ కుడిచేతి బ్యాటర్ సంజూను ఓపెనర్‌గా పంపింది. అతను ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. దీంతో అభిషేక్ శర్మ క్రీజులో స్థిరపడేందుకు సమయం లభించింది.ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టును బలమైన స్థితిలో నిలబెట్టారు. పవర్ ప్లే ముగిసే సమయానికి భారత్ 80/1 స్కోర్ నమోదు చేయడం గమనార్హం.*ఆర్డర్ కాదు... ఆపద్బాంధవులు కావాలి! టీమిండియాకు ఇప్పుడు అదే అత్యవసరం* టీ20 ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు చేరుకున్న తర్వాత పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. వరుస పరాజయాలతో ఆతిథ్య శ్రీలంక ఇప్పటికే టోర్నీ నుంచి తప్పుకోగా, భారత జట్టుపై కూడా ఒత్తిడి పెరిగింది. దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓటమి చవిచూడడంతో సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. గ్రూప్ 'ఏ'లో మూడో స్థానంలో ఉన్న సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో సంచలన విజయాలే సాధించాలి. కేవలం గెలుపు సరిపోదు... రన్‌రేటు పెంచే భారీ తేడా విజయం అవసరం.

**నిలబెట్టే వారు కావాలి**

టీ20 ఫార్మాట్‌లో ఒక్కోసారి టాప్ ఆర్డర్ కూలిపోతే జట్టు కుదేలవుతుంది. అలాంటి సమయంలో క్రీజులో పాతుకుపోయి ఇన్నింగ్స్‌ను కాపాడే ఆటగాళ్లు అవసరం. సూపర్ 8 దశలో న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్లు అదే చేసి చూపించాయి.ప్రేమదాస స్టేడియంలో శ్రీలంక బౌలర్ల దాడికి న్యూజిలాండ్ టాప్ ఆర్డర్ చిత్తయింది. 84 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన దశలో కెప్టెన్ మిచెల్ శాంట్నర్, కొలే మెక్‌కొన్చీ కలిసి బాధ్యత తీసుకున్నారు. ఏడో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పోటీతత్వ స్కోరుకు చేర్చారు. తర్వాత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కివీస్ విజయాన్ని అందుకుంది.

**విండీస్ పోరాటం**

ఇదే తరహాలో వెస్టిండీస్ కూడా కష్టసమయంలో తేరుకుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి 83 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన దశలో మ్యాచ్ పూర్తిగా చేజారిపోయినట్టే కనిపించింది. కానీ రొమారియో షెపర్డ్, జేసన్ హోల్డర్ ధైర్యంగా ఎదురుదాడి చేసి స్కోరును 170 దాటించారు. చివరి ఓవర్లలో భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తెచ్చి మ్యాచ్‌ను తిరగరాశారు.

**భారత్‌కు అదే లోటు**

భారత్ మాత్రం కీలక సమయాల్లో ఆపద్బాంధవుల కొరతతో ఇబ్బంది పడుతోంది. లీగ్ దశలో యూఎస్ఏపై తొలి మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ విఫలమైన వేళ సూర్యకుమార్ యాదవ్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గట్టెక్కించాడు. పాకిస్థాన్‌పై ఓపెనర్ ఇషాన్ కిషన్ అర్ధశతకంతో బలమైన ఆరంభం ఇచ్చినా, మిగతా బ్యాటర్లు నిలబడలేక భారీ స్కోర్ సాధించే అవకాశాన్ని కోల్పోయారు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆరంభంలో సఫారీ జట్టును కట్టడి చేసినా, డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ చెలరేగడంతో మ్యాచ్ దిశ మారింది. అనంతరం ఛేదనలో మార్కో యాన్సెన్ బౌలింగ్ దెబ్బకు టాప్ ఆర్డర్ కూలిపోయింది. ఆ సమయంలో ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం ఎవరూ చేయలేకపోయారు. శివం దూబే ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది.

**ముందున్న సవాల్**

ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో జింబాబ్వే, వెస్టిండీస్‌పై భారీ తేడాతో గెలవడం తప్ప మార్గం లేదు. క్రీజులో నిలబడి భాగస్వామ్యాలు నెలకొల్పే ఆటగాళ్లు ముందుకొస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. లేకపోతే శ్రీలంకలా భారత్ కూడా టోర్నీకి వీడ్కోలు పలకాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు.సమిష్టి కృషి, ఒత్తిడిలో స్థైర్యం... ఇవే ఇప్పుడు సూర్యకుమార్ సేనకు అత్యవసరం. సంజూ ఇన్నింగ్స్‌పై అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసలు కురిపించారు. భారీ స్కోరు కాకపోయినా, జట్టుకు కావాల్సిన స్థిరత్వం ఇచ్చిన ఇన్నింగ్స్‌గా దీనిని అభివర్ణిస్తున్నారు.



## ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ రేసులో ముందున్నది వీరే

ప్రపంచకప్ 2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. లీగ్ దశ పూర్తవడంతో 13 జట్లు టోర్నీకి వీడ్కోలు పలికాయి. ఇంగ్లాండ్ జాతీయ క్రికెట్ జట్టు ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోగా, సూపర్ 8 దశలో మిగిలిన మూడు స్థానాల కోసం ఆరు జట్లు పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కోసం బలమైన పోటీ కనిపిస్తోంది.



**విల్ జాక్స్ (ఇంగ్లాండ్)**

విల్ జాక్స్ ఇంగ్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆరు మ్యాచ్‌ల్లో 159 పరుగులు సాధించి, జట్టును సూపర్ 8 దశకు చేర్చడంలో ముందుండాడు. అవసరమైన సందర్భాల్లో బౌలింగ్‌లోనూ ఐదు వికెట్లు తీసి ప్రభావం చూపించాడు. ఇప్పటికే మూడు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం అతని ప్రదర్శనకు నిదర్శనం.

**మార్కో జాన్సెన్ (దక్షిణాఫ్రికా)**

మార్కో జాన్సెన్ ఆల్‌రౌండ్ ప్రతిభతో దక్షిణాఫ్రికాకు బలంగా నిలిచాడు. బౌలింగ్‌లో కీలక వికెట్లు తీస్తూ ప్రత్యర్థులను కట్టడి చేశాడు. అఫ్గానిస్తాన్‌పై కీలక పరుగులు జోడించి తన సామర్థ్యాన్ని చాటాడు. దక్షిణాఫ్రికా ఫైనల్ దాకా వెళ్లితే జాన్సెన్ అవార్డు రేసులో ముందుండే అవకాశం ఉంది.

**ఇషాన్ కిషన్ (భారత్)**

ఇషాన్ కిషన్ టీమిండియా తరపున అగ్రెసివ్ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. పాకిస్తాన్‌పై అర్ధశతకం నమోదు చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. నమీబియాపై కూడా మెరుగైన ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయాల్లో భాగమయ్యాడు. భారత్ సెమీఫైనల్, ఫైనల్ దశలకు చేరితే అతనికి అవకాశాలు మెరుగుపడతాయి.

**గ్లెన్ ఫిలిప్స్ (న్యూజిలాండ్)**

గ్లెన్ ఫిలిప్స్ బహుముఖ ప్రతిభతో ఆకట్టుకుంటున్నాడు. రెండు వికెట్ల నష్టానికి 137 పరుగులు సాధించిన అతను, ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం ప్రదర్శించి అనేక పరుగులు ఆదా చేశాడు. అవసరమైనప్పుడు బౌలింగ్‌లోనూ తోడ్పాటు అందిస్తున్నాడు.

**షిమ్రాన్ హెట్మైర్ (వెస్టిండీస్)**

షిమ్రాన్ హెట్మైర్ ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఐదు మ్యాచ్‌ల్లో 219 పరుగులు చేసి 186 స్ట్రైక్‌రేట్‌తో దూకుడు చూపించాడు. ప్రతి మ్యాచ్‌లోనూ తన బ్యాట్‌తో జట్టుకు కీలక సహకారం అందించాడు. సూపర్ 8 పోటీలు ఉత్కంఠగా సాగుతున్న వేళ, ఈ ఐదుగురిలో ఎవరు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## దక్షిణాఫ్రికా ఘన విజయం.. టీమిండియాకు ఊరట

**భారత్‌కు సెమీఫైనల్ మార్గం సుగమమ!**

*అహ్మదాబాద్:* సూపర్ 8 దశలో దూకుడు కొనసాగిస్తోంది. పై 9 వికెట్ల తేడాతో గెలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ ఫలితం భారత్‌కు కూడా ఊరట కలిగించింది. ఇక నుంచి టీమిండియా తన చేతుల్లోనే పరిస్థితిని ఉంచుకుంది.

అహ్మదాబాద్‌లోని లో గురువారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 16.1 ఓవర్లలోనే ఛేధించింది. కెప్టెన్ 82 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, 47 పరుగులతో వేగవంతమైన సహకారం అందించాడు.

**భారత్‌కు మార్గం స్పష్టం**

ఈ ఫలితంతో గ్రూప్ 1 సమీకరణాలు సులభమయ్యాయి. మిగిలిన జింబాబ్వే, వెస్టిండీస్ మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే నెట్ రన్‌రేట్ అవసరం లేకుండానే సెమీఫైనల్‌కు చేరుతుంది. రెండు గెలుపులతో నాలుగు పాయింట్లు సాధించి రెండో స్థానాన్ని ఖాయం చేసుకోవచ్చు.

**ఓటమి వచ్చినా అవకాశాలు మిగిలేలా**

ఒకవేళ జింబాబ్వేపై భారత్ తడబడినా, చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను భారీ తేడాతో ఓడిస్తే అవకాశాలు నిలుస్తాయి. అదే సమయంలో జింబాబ్వేను దక్షిణాఫ్రికా ఓడిస్తే మూడు జట్లు సమాన పాయింట్లతో నిలిచే పరిస్థితి వస్తుంది. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం అవుతుంది.

**పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా ఆధిపత్యం**

సూపర్ 8 గ్రూప్ 1లో దక్షిణాఫ్రికా రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. వెస్టిండీస్ ఒక గెలుపుతో రెండో స్థానంలో నిలిచింది. భారత్ ఇంకా ఖాతా తెరవకపోయినా, మిగిలిన రెండు మ్యాచ్‌లు ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. జింబాబ్వేకు కూడా ఇవే కీలక సమరాలు.

## చెన్నైలో సంజూ దూకుడు.. భారత్‌కు ఊరటనిచ్చిన ఆరంభం



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా చెన్నై వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ప్రభావవంతమైన ఆరంభం అందించాడు. 15 బంతుల్లో 24 పరుగులు చేసినప్పటికీ, గత మ్యాచ్‌ల్లో ఎదురైన డకౌట్ల సమస్యకు ముగింపు పలికాడు. ప్రత్యర్థులు ఎడమచేతి బ్యాటర్లపై ఆఫ్ స్పిన్నర్లతో ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో, మేనేజ్‌మెంట్ కుడిచేతి బ్యాటర్ సంజూను ఓపెనర్‌గా పంపింది. అతను ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. దీంతో అభిషేక్ శర్మ క్రీజులో స్థిరపడేందుకు సమయం లభించింది. ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టును బలమైన స్థితిలో నిలబెట్టారు. పవర్ ప్లే ముగిసే సమయానికి భారత్ 80/1 స్కోర్ నమోదు చేయడం గమనార్హం.సంజూ ఇన్నింగ్స్‌పై అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసలు కురిపించారు. భారీ స్కోరు కాకపోయినా, జట్టుకు కావాల్సిన స్థిరత్వం ఇచ్చిన ఇన్నింగ్స్‌గా దీనిని అభివర్ణిస్తున్నారు.




## మార్క్రమ్ మెరుపులు... సెమీస్ దిశగా దక్షిణాఫ్రికా

*అహ్మదాబాద్:* టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో అద్భుత ప్రదర్శన కనబరిచింది. పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్ దిశగా కీలక అడుగు వేసింది. ఈ విజయానికి కెప్టెన్ ప్రధాన కారణంగా నిలిచాడు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. ప్రారంభంలోనే వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆ జట్టును (52 నాటౌట్), (49)లు ఆదుకున్నారు. ఎనిమిదో వికెట్‌కు వీరిద్దరూ విలువైన భాగస్వామ్యం నమోదు చేసి జట్టుకు పోటీ స్థాయి స్కోరు అందించారు. అయితే లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా పూర్తిగా ఆధిపత్యం చాటింది. మార్క్రమ్ అజేయంగా 82 పరుగులు చేసి జట్టును ముందుండి నడిపించాడు. కేవలం 16.1 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని సులభంగా చేరుకుంది. బౌలింగ్‌లో , లు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుదిపేశారు. ఈ ఫలితం కు కూడా అనుకూలంగా మారింది. గ్రూప్ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకోవడంతో భారత్‌కు సెమీస్ అవకాశాలు మరింత స్పష్టమయ్యాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శనతో టీమిండియా కూడా చివరి నాలుగులోకి చేరే దిశగా ముందడుగు వేయనుంది



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## టీఎల్జే మ్యాగజైన్‌పై మెరిసిన నిధి

టీఎల్జే మ్యాగజైన్ తాజా సంచిక కవర్‌పై నిధి అగర్వాల్ ప్రత్యేక లుక్‌తో ఆకట్టుకుంది. నల్లటి చీర, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో క్లాసిక్ స్టైల్‌ను ప్రదర్శిస్తూ స్టేట్‌మెంట్ ఆభరణాలతో గ్లామర్‌ను హైలైట్ చేసింది. బోల్డ్ మేకప్, ధైర్యవంతమైన పోజులు ఆమెకు టైమ్‌లెస్ అపీల్ ఇచ్చాయి. మరో లుక్‌లో లైట్ పింక్ ఎంబ్రాయిడరీ లెహంగాలో కలల వధువుగా మెరిసింది. కార్సెట్ స్టైల్ బ్లౌజ్, సాఫ్ట్ పాస్టల్ షేడ్ ఆమె అందాన్ని మరింత నాజూకుగా చూపించాయి. సంప్రదాయానికి ట్రెండీ టచ్ జోడించిన ఈ ఫోటోషూట్ ఫ్యాషన్ ప్రేమికులను ఆకట్టుకుంటోంది.



## సూర్య–పూరి కాంబోలో మూవీ

**ఫిలింనగర్‌లో జోరుగా చర్చలు**

విజయ్ సేతుపతితో తెరకెక్కిస్తున్న 'స్లమ్ డాగ్' చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో దర్శకుడు పూరి జగన్నాథ్ కొత్త ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, కోలీవుడ్ స్టార్ సూర్యతో సినిమా ఖరారయ్యే అవకాశాలపై చర్చలు వినిపిస్తున్నాయి. వరుస ఫ్లాప్‌ల తర్వాత టాప్ హీరోతో ప్రాజెక్ట్ సెట్ కావడం కష్టమేనని భావించినా, పూరిపై ఉన్న నమ్మకమే ఈ కాంబోకు కారణమై ఉండొచ్చని అంటున్నారు. ఇక 'స్లమ్ డాగ్' ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటించగా, కన్నడ నటుడు దునియా విజయ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. టబు కీలక పాత్ర పోషించారు. థియేటర్ బిజినెస్, OTT ఒప్పందాలు పూర్తికాకపోవడంతో విడుదల తేదీ ఇంకా ఖరారు కాలేదు. వేసవిలో తమిళ, తెలుగు భాషల్లో ఒకేసారి విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి కథపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. 'స్లమ్ డాగ్'పై అభిమానుల్లో నమ్మకం వ్యక్తమవుతోంది. ఇదే జోరు కొనసాగితే పూరి నుంచి మరో కంటెంట్ ఆధారిత చిత్రం వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాల అంచనా. ప్రస్తుతం సూర్య 'కరుప్పు' విడుదల కోసం ఎదురుచూస్తుండగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలోని సినిమా చివరి దశలో ఉంది.





## 'పెద్ది' రెండో పాటకు రెడీ..

**యూత్‌ను మళ్లీ ఊపేందుకు రామ్ చరణ్ సిద్ధం**

'చికిరి చికిరి' పాటతో ట్రెండ్ సృష్టించిన రామ్ చరణ్ మరోసారి మ్యూజిక్‌తో మ్యాజిక్ చేయాలని చూస్తున్నారు. ఆ సాంగ్‌లో ఆయన వేసిన హుక్ స్టెప్ సోషల్ మీడియాలో భారీ స్థాయిలో వైరల్ కావడంతో అనేక మంది అభిమానులు రీల్స్ రూపంలో దాన్ని అనుకరించారు. ప్రస్తుతం బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'పెద్ది'లో చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇందులో జాన్వీ కపూర్ కథానాయికగా కనిపించనున్నారు. చిత్రీకరణ వేగంగా కొనసాగుతుండగా, ఈ సినిమా నుంచి రెండో సింగిల్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. 'నీ అయ్య వడ్డీ... నీ బిడ్డ కడితే నువ్వేమి పొడిచావనే.. రై రై రారా..' అంటూ సాగే ఈ పాటను మార్చి 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని రామ్ చరణ్ ఎక్స్‌లో పంచుకుంటూ, ఈ సాంగ్ మరింత ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 27న విడుదల చేయాలని యోచించారు. అయితే మిగిలిన షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదల తేదీని ఏప్రిల్ 30కు మార్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా 'చికిరి చికిరి' పాటకు వస్తున్న ఆదరణ తగ్గడం లేదు. తెలుగు లిరికల్ వీడియో ఇప్పటికే 175 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి రికార్డుల దిశగా దూసుకెళ్తోంది.

## దృశ్యం3 నుంచి వెంకీ ఎగ్జిట్?

మలయాళ 'దృశ్యం 3' త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు ఈ భాగంతో కథకు ముగింపు ఇవ్వనున్నారు. ఇందులో ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. హిందీలో మాత్రం తో వేరే కథరూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. అయితే తెలుగులో పరిస్థితి అనిశ్చితంగా మారింది. ప్రస్తుతం ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో 'దృశ్యం 3' ప్రారంభంపై స్పష్టత లేదు. మలయాళ వెర్షన్ త్వరగా ఓటీటీలోకి వచ్చే అవకాశంతో రీమేక్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిలింనగర్ వర్గాలు మాత్రం తెలుగు వెర్షన్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నాయని చెబుతున్నాయి.






## 'కేరళ స్టోరీ2' విడుదలకు హైకోర్టు స్టే

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'కేరళ స్టోరీ 2' విడుదలను కేరళ హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. సినిమా కంటెంట్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మత, సామాజిక అంశాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు వివాదాస్పదంగా ఉన్నాయని కోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఇటువంటి అంశాలున్నప్పటికీ ప్రదర్శనకు అనుమతి ఎలా మంజూరైందని ప్రశ్నించింది. ముఖ్యంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేసింది.
సర్టిఫికేషన్ ప్రక్రియలో పూర్తి పరిశీలన జరిగిందా అనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. సినిమా ప్రదర్శన వల్ల సామాజిక సామరస్యంపై ప్రభావం పడే అవకాశముందని భావించిన ధర్మాసనం, తదుపరి విచారణ వరకు విడుదలకు అనుమతి లేదని స్పష్టం చేసింది. తాజా పరిణామంతో చిత్ర బృందానికి ఎదురుదెబ్బ తగిలింది. తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.



## కొడవ సంప్రదాయంలో మరోసారి విజయ్–రష్మిక పెళ్లి

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గురువారం ఉదయం 10.10 గంటలకు రాజస్థాన్‌లోని మెమెంటోస్ ప్యాలెస్లో తెలుగు హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి జరిగింది. సాయంత్రం రష్మిక కుటుంబ సంప్రదాయాన్ని గౌరవిస్తూ కొడవ ఆచారంలో మరోసారి వివాహ వేడుక నిర్వహించనున్నారు. కర్ణాటకలోని కొడగు ప్రాంతానికి చెందిన కొడవ సమాజంలో పెళ్లిని 'మంగళ'గా పిలుస్తారు. ఈ విధానంలో పురోహితులు, హోమాలు ఉండవు. పెద్దల సమక్షంలో ప్రకృతి సాక్షిగా వివాహం జరుగుతుంది. వరుడు నల్లటి 'కుప్య', నడుము పట్టీ, చిన్న కత్తి ధరించగా, వధువు ప్రత్యేక శైలిలో చీర కట్టుకుంటుంది. వేదికకు వెళ్లే ముందు వరుడు అరటి చెట్టు కాండాన్ని నరుకడం పరాక్రమానికి సూచకం. పెళ్లి సమయంలో పెద్దల దీవెనలకే ప్రాధాన్యం ఉంటుంది. వధువుకు నాణేల మూట అందించడం శుభసూచకంగా భావిస్తారు. అనంతరం అత్తింటిలో గంగా పూజ నిర్వహిస్తారు. కొడవ వివాహాల్లో మాంసాహారం, మద్యం విందు ప్రత్యేకతగా ఉంటాయి.

## 'ప్యారడైజ్' సాంగ్‌పై వివాదం.. హుక్ స్టెప్‌పై బాబా జాక్సన్ ఆరోపణలు

నాని ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'ప్యారడైజ్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ విస్తరణకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇటీవల విడుదలైన 'ఆయా షేర్' పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా అందులోని హుక్ స్టెప్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే ఈ స్టెప్‌పై ప్రముఖ సోషల్ మీడియా డ్యాన్సర్ బాబా జాక్సన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను గతంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన డ్యాన్స్ మూమెంట్‌ను చిత్రంలో ఉపయోగించారని ఆయన ఆరోపించారు. సినిమా కొరియోగ్రఫీ తన స్టైల్‌ను అనుసరించిందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో చర్చ చెలరేగింది. కొందరు అభిమానులు ఆరోపణలను ఖండిస్తుండగా, మరికొందరు రెండు స్టెప్పులను పోల్చి చూస్తున్నారు. ఈ అంశంపై చిత్ర బృందం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com